సోమవారం
03-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 280
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నాటోలో టర్కీ వద్దు: టీకేపీ

నాటోను విస్తరించేందుకు కాదు, అందులో నుంచి టర్కీ బయటకు వచ్చేందుకు పార్లమెంటులో ఓటింగ్ జరగాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) నొక్కిచెప్పింది. ఏదో ఒక రోజు అది తప్పక జరుగుతుందని తాజా ప్రకటనలో ఆకాంక్షించింది.

2లో

బీజేపీపై సీపీఐ రణభేరి

- ప్రచార కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- రేపు విజయవాడలో రౌండ్‌టేబుల్
- జగనన్న ఇళ్లు, టిడ్కో సమస్యలపై దృష్టి సారించాలి
- ప్రతిష్ఠాత్మకంగా రాజకీయ శిక్షణ తరగతులు
- మేడేలో పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ పాలనపై సీపీఐ-సీపీఎం అధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 30 వరకు చేపట్టిన ప్రచారయాత్రలను, సభలను దిగ్విజయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యవర్గ సమావేశం విజయవాడ చంద్రం బిల్డింగ్ నుంచి ఆదివారం సాయంత్రం జూమ్ యాప్ ద్వారా జరిగింది. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అధ్యక్షత వహించగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్ట రాయప్ప తదితరులు హాజరయ్యారు. వివిధ జిల్లాల నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా, నగర కార్యదర్శులు హాజరయ్యారు.

రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడుగడుగునా అప్రజాస్వామిక విధానాల్ని అవలంబిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బీజేపీ విధానాల్ని వ్యతిరేకిస్తూ జాతీయ పార్టీల పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 నుంచి 30 వరకు జరిగే ప్రచార యాత్రలు, సభలు విజయవంతం చేయాలని, వాటిలో పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఈ ప్రచారయాత్రల సభలకు సీపీఐ, సీపీఎం జాతీయ నేతలను ఆహ్వానించేలా దృష్టి సారించామని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికిగాను పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేయనున్నామన్నారు. రాష్ట్రంలో జగన్ హయాంలో దళిత, మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను ఖండిస్తూ ఈనెల 4వ తేదీన విజయవాడలో సీపీఐ తరపున రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలను ఆహ్వానిస్తున్నామని, ఈ రౌండు టేబుల్ విజయవంతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల సమస్యలపై అన్ని పట్టణ కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల సమస్యలపై ప్రభుత్వ విధానాలను పూర్తిగా తిప్పికొట్టాలని, లబ్ధిదారులను చైతన్యవంతుల్ని చేయాలని కోరారు.

ఏఐటీయూసీ అధ్వర్యంలో నిర్వహించనున్న మేడేలో పార్టీ శ్రేణులు పూర్తిగా భాగస్వామ్యం కావాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగిన ఉద్యమంలో ఏఐటీయూసీ, సీపీఐ ఉద్యమపాత్రను ఆయన వివరించారు. ప్రాంతాల వారీగా పార్టీ అనుబంధ ప్రజాసంఘాలు రాజకీయ శిక్షణ తరగతులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, వాటి విజయవంతానికి పార్టీ శ్రేణులు పూర్తిగా సహకరించాలని కోరారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని జిల్లాల్లో పోటీకి సిద్ధమయ్యే అసెంబ్లీ నియోజకవర్గాలపైనా పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని రామకృష్ణ సూచించారు.

టెన్షన్...టెన్షన్

- వైసీపీ ఎమ్మెల్యేల్లో భయం
- టికెట్లపై తేలనున్న భవితవ్యం
- పనితీరు బాగోని వారికి మొండిచేయి
- నేడు వైసీపీ ముఖ్యనేతలు, సమన్వయకర్తలతో జగన్ సమావేశం
- కేబినెట్-3.0, ముందస్తు ఎన్నికలపై నిర్ణయం?
- జగనన్నే మన భవిష్యత్‌పై దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది. వైసీపీ ముఖ్యనేతలు, ప్రాంతీయ, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నిర్వహించబోయే సమావేశం కలవరం రేపుతోంది. సమావేశంలో ప్రధాన అజెండాగా పనితీరు సరిగాలేని ఎమ్మెల్యేలకు చెక్ పెట్టడం, కేబినెట్ 3.0 విస్తరణ, ముందస్తు ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలన, పార్టీశ్రేణులను సమాయత్తం చేయడం వంటి చర్యలకు ఆయన సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరగనున్న ఈ సమావేశం కీలకంగా నిలవనుందని భావిస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేల భవితవ్యానికి ఇది వేదిక కానుంది. ఇప్పటికే రెండు విడతలుగా ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో జగన్ అత్యవసరంగా భేటీ అయ్యారు. కేవలం 15 రోజుల్లోనే రెండుసార్లు సీఎం ఢిల్లీకి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆ సమయంలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ కేసుల వ్యవహారంతోనే సీఎం ఢిల్లీ వెళ్లారంటూ ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఇప్పటివరకు జగన్ నిర్వహించిన వివిధ సమీక్షలతో చాలామంది ఎమ్మెల్యేల పనితీరు బాగోనందున, వారికి టికెట్లు రావనే సంకేతాలను అధినేత ఇచ్చారు. దానిని గమనించిన ఎమ్మెల్యేలు పక్కచూపులు చూడటం, రాజకీయ భవిష్యత్ కోసం ఇతర పార్టీల్లో చేరికకు సిద్ధమయ్యారు. పనితీరు బాగాలేదని, సొంత పార్టీపైనే తిరుగుబావుటా ఎగురవేయడంతో సొంత పార్టీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లను నియమించారు. మరో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నియోజకవర్గంలోనూ ఇన్‌చార్జ్‌ని నియమించేందుకు అధిష్ఠానం సిద్ధమైంది. అధిష్ఠానం ఒంటెత్తు పోకడలపై సొంత పార్టీ నేతల్లోనే తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ సమావేశంలో గడపగడపకు మన ప్రభుత్వం, గృహ సారథుల అంశాలపైనా పార్టీ తరపున నిర్ణయం తీసుకోనున్నారు. జగనన్నే మన భవిష్యత్ క్యాంపెయిన్‌పైనా పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేస్తారు.

అపాయింట్‌మెంట్ లేక ఎమ్మెల్యేల పడిగాపులు

నాలుగేళ్ల నుంచి సీఎం జగన్ అపాయింట్‌మెంట్లు లేనందున సొంత పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల సమయంలో స్థానికంగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే అవకాశం లేక ఎమ్మెల్యేలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నియోజకవర్గానికి నిధుల నుంచి అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వాటిని సీఎం జగన్‌ను కలిసి చెప్పుకునే అవకాశం లేక... సీఎం అపాయింట్‌మెంట్ దొరకక పడిగాపులు

- మిగతా 2 లో

ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి

నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: బాధ్యతాయుత పదవిలో ఉండి వివాదాస్పద వ్యాఖ్యలు చేసే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధాని మోదీని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని సందిగ్ధంలో ఉన్న 20 గ్రామాలలో పర్యటించినప్పుడు అక్కడున్న ఆంధ్రావారిని 'గో బ్యాక్ ఆంధ్రా' అనడం దుర్మార్గమని, ఇటువంటి బాధ్యతారాహిత్యం ఆక్షేపణీయమని నారాయణ అన్నారు. ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని మోదీకి సూచించారు. దీర్ఘకాలంగా ఎటూ తేలకుండా ఉన్న 20 సరిహద్దు గ్రామాల సమస్యను పరిష్కరించాలని కూడా నారాయణ డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- నెలరోజులుగా గొడవలు
- సర్దుబాటుకు వెళ్లిన అన్న సజీవ దహనం
- తిరుపతి జిల్లాలో ఘటన

విశాలాంధ్ర-తిరుపతి : వివాహేతర సంబంధం రెండు కుటుంబాల మధ్య కక్షలకు కారణమైంది. అవి తారాస్థాయికి చేరుకోవడంతో సమస్యను సర్దుబాటు చేద్దామని వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న ఒక

- మిగతా 2 లో

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ కుట్రలు ఆపండి

- కేంద్రానికి తెలంగాణ మంత్రి కేటీఆర్ బహిరంగ లేఖ
- బీఆర్ఎస్ పార్టీగా అడ్డుకుని తీరతామని హెచ్చరిక

హైదరాబాద్: విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలని, కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టే పన్నాగాలను కేంద్ర ప్రభుత్వ పెద్దలు మానుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉందని మండిపడ్డారు. ఇప్పటికే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలన్న కుట్రలను ఎప్పటికప్పుడు అక్కడి కార్మికులు, అనేక ఇతర సంఘాలు, బీఆర్ఎస్ వంటి పార్టీలు అడ్డుకుంటున్న నేపథ్యంలో తాజాగా కేంద్రం దొడ్డిదారిన ప్రైవేటుకు కట్టబెట్టే కుతంత్రానికి తెరలేపిందని వెల్లడించారు. వర్కింగ్ క్యాపిటల్, ముడిసరుకు కోసం నిధుల సమీకరణ పేరిట విశాఖ ఉక్కును ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ఏకంగా నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. కేంద్రం కుట్రలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. బీజేపీ... తన ఎజెండా అమలు కోసం మాత్రమే విశాఖ ఉక్కును క్రమంగా చంపే ప్రయత్నం ఎప్పటినుంచో చేస్తోందన్నారు. మౌలిక

- మిగతా 2 లో



నేటి నుంచి పది పరీక్షలు

- 3,349 పరీక్షా కేంద్రాలు
- అంధ విద్యార్థులకు కంప్యూటర్ సాయం
- ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 తర్వాత నిముషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోరు. ఈ ఏడాది 6 సబ్జెక్ట్‌లకు ఆరు రోజుల పరీక్షలను రోజు విడిచి, రోజు సీబీఎస్‌ఈ తరహాగా షెడ్యూలు విధించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే ఇన్విజిలేషన్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు మొత్తం 6,09,070 విద్యార్థులు హాజరు

- మిగతా 2 లో

నేటి నుంచి ఒంటిపూట బడులు 2లో

ఇదీ లోకం!

పోనీ 'విజీనగరంలో' మన ఇలాకాలో పోద్దామా బావా!

పరువునష్టం కేసుపై రాహుల్ అప్పీల్

నేడు సూరత్ సెషన్స్ కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ/సూరత్: పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్షకు గురైన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ... ఆ తీర్పుపై అప్పీలు చేయబోతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. దోషిత్వ నిర్ధారణ, శిక్ష విధింపుపై సోమవారం సూరత్ సెషన్స్ కోర్టులో రాహుల్ సవాల్ చేయబోతున్నట్లు వెల్లడించాయి. మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని, దోషిత్వ నిర్ధారణ తీర్పును తాత్కాలికంగా నిలిపేయాలని కోరబోతున్నట్లు తెలిపాయి. ఇదే విషయాన్ని రాహుల్ తరపు న్యాయవాది కిరీట్ పన్వాలా కూడా సూరత్‌లో ధృవీకరించారు. రాహుల్‌గాంధీ సోమవారం సూరత్ వస్తున్నారని, తన తీర్పుపై సెషన్స్ కోర్టులో అప్పీల్ చేస్తున్నారని వెల్లడించారు. సెషన్స్ కోర్టులో ఆయన స్వయంగా హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సెషన్స్ కోర్టులో అప్పీలును దాఖలు చేస్తారన్నారు. రాహుల్‌గాంధీ వెంట పార్టీ సీనియర్ నేతలు కూడా సూరత్ రానున్నారు. కోర్టు తీర్పుతో రాహుల్ తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీ 2019లో కర్ణాటకలోని కోలార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ దొంగలందరికీ ఇంటి పేరు మోదీ ఎలా ఉంటోందని ప్రశ్నించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి పరువు నష్టం

- మిగతా 2 లో

అకాల వర్షం అపార నష్టం

రైతుకు కడగండ్లు మిగిల్చిన వడగళ్ల వానలు

- యూపీ, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధిక ప్రభావం
- 5.23లక్షల హెక్టార్లలో గోదుమ పంటకు దెబ్బ - తగ్గిన దిగుబడి

న్యూఢిల్లీ/చండీగఢ్/భోపాల్/జైపూర్: అకాల వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని కలిగించాయి. వడగళ్ల వానలు కడగండ్లు మిగిల్చాయి. పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు, వడగళ్ల వర్షాలు కురిసి రైతన్న ఆశలను ముంచెత్తాయి. జరిగే నష్టాన్ని ఊహించి

- మిగతా 2 లో

నాటోలో టర్కీ వద్దు: టీకేపీ

అంకారా: నాటోను విస్తరించేందుకు కాదు, అందులో నుంచి టర్కీ బయటకు వచ్చేందుకు పార్లమెంటులో ఓటింగ్ జరగాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) నొక్కిచెప్పింది. ఏదో ఒక రోజు అది తప్పక జరుగుతుందని తాజా ప్రకటనలో ఆకాంక్షించింది. నాటోలో భాగంగా విదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న టర్కీ సైన్యం రీకాల్ జరుగుతుందని విశ్వాసం వ్యక్తంచేసింది. తాజాగా ఫిన్లాండ్‌ను నాటో కూటమిలో చేర్చే విషయంలో టర్కీ పార్లమెంటులో ఓటింగ్‌ను టీకేపీ వ్యతిరేకించింది. 'పార్లమెంటు జనరల్ అసెంబ్లీ నాటోలో ఫిన్లాండ్ చేర్పుపై ప్రోటోకాల్‌ను ఆమోదించే బిల్లును కూడా చర్చిస్తుంది. ఈ ఓటింగ్ అక్రమమైనది. టర్కీలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో త్వరలోనే పార్లమెంటు మారుతుంది. యుద్ధప్రాతిపదికన పార్లమెంటు ప్లీనరీ సమావేశంలో ఈ అంశాన్ని తేవడం ఆమోదయోగ్యమైనది కాదు. ఉత్తర యూరప్‌లో నాటో విస్తరణకు కసరత్తు జరుగుతోంది. స్వీడెన్, ఫిన్లాండ్‌ను చేర్చుకునే అంశమై చర్చలు సాగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని సాగదీస్తూ ఆ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగించే ఉద్దేశం కనిపిస్తోంది. పాశ్చాత్య సామ్యావాద దేశాలు ముఖ్యంగా అమెరికా... ఈ యుద్ధం ముగియాలని కోరుకోవడం లేదు. మరోవైపు టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ముందు నుంచే స్వీడెన్, ఫిన్లాండ్ నాటో సభ్యత్వాన్ని దేశీయ రాజకీయ అంశంగా వాడుతున్నారు. కొన్ని సార్లు వీటోకార్డు వాడే ప్రయత్నం చేశారు. మరికొన్నిసార్లు సామ్యవాదులతో జతకట్టేందుకూ యత్నించారు. ఫలితం ఎప్పుడు ఒకటే. అయితే ఎర్డోగన్ విదేశీ విధానం వల్ల దేశం సామ్యావాద లెక్కల ఉచ్చులో చిక్కుకుపోతోంది. నాటో ఓ ఉగ్రవాదసంస్థ. ఏర్పాటైన రోజు నుంచి దేశాల అంతర్గత వ్యవహారాల్లో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా జోక్యం చేసుకుంటూనే ఉంది. కార్మికులు తమ హక్కులు, సామనత్వం, స్వేచ్ఛ కోసం సంఘటితమైన ప్రతిసారీ రక్తాన్ని చిందించింది. టీకేపీ ఆది నుంచి మన దేశ అవసరాల కోసం ఈ నేర వ్యవస్థ పీడను వదిలించుకోవాలని చెబుతోంది. టర్కీ గ్రాండ్ నేషనల్ అసెంబ్లీలో ఓటింగ్ అంటూ జరిగితే అది నాటో నుంచి నిష్క్రమించే విషయంలో అయివుండాలేగానీ దాన్ని విస్తరించడంపై కాకూడదని ప్రకటనలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ నొక్కిచెప్పింది. దీనిపై టీకేపీ పూర్తి స్పష్టతతో ఉందని, నాటో నుంచి టర్కీ నిష్క్రమణ తథ్యమని, నాటోలో భాగంగా విదేశీ విధుల్లో ఉన్న మన సైన్యం రీకాల్ జరుగుతుందని ప్రకటన పేర్కొంది. దేశంలోని అమెరికా స్థావరాలు మూతపడతాయని తెలిపింది. అణ్వాయుధాలు నాశనమవుతాయని, ఇతర దేశాల్లోని భూభాగాల్లో ఖాతాలు ఉన్న వారితో ఎటువంటి సయోధ్య ఉండదని పేర్కొంది. దేశభక్తికి ఇది అనివార్యమని టర్కీ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నొక్కిచెప్పింది.

అమెరికాలో టోర్నడోల బీభత్సం

26 మంది మృతి - 131 మందికి గాయాలు

ఆరు లక్షలకుపైగా ఇళ్లకు నిలిచిన విద్యుత్ సరఫరా

టెన్నెస్సీతో సహా అనేక రాష్ట్రాల్లో భారీగా ఆస్తినష్టం

హౌస్టన్: అమెరికాను వరుస టోర్నడోలు వణికిస్తున్నాయి. భీకర గాలులతో దక్షిణ-మధ్య, తూర్పు అమెరికాలో బీభత్సం జరిగింది. ఇళ్లు పేకమేడల్లా కూలిపోయారు. చెట్లు విరిగి పడ్డాయి. రవాణా స్తంభించిపోయింది. అనేక కార్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆరు లక్షలకుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. టెన్నెస్సీతో సహా అనేక రాష్ట్రాల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఇప్పటికే మరణించిన వారి సంఖ్య 26కు పెరిగింది. 131 మంది గాయపడ్డారు. ఈ మేరకు స్థానిక అధికారులు తెలిపారు. దక్షిణ అర్కాన్సాస్, మిసిసిపి,అలబామా, మిడ్‌వెస్ట్‌లోని ఇండియానా, ఇల్లినాయిస్‌లలో మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి. తూర్పు తీరంలో తుపాను కారణంగా ఆదివారం వరకు ఉరుములు, వడగళ్లు, శక్తివంతమైన గాలులు వీస్తాయని వాతావరణ విభాగం అంచనా వేసింది. శుక్రవారం అసాధారణ పరిస్థితి తలెత్తి రాజధాని లిటిల్ రాక్‌తో సహా అర్కాన్సాస్‌లో భీకర గాలులకు ఐదుగురు చనిపోయారు. ఈ మేరకు ఆ రాష్ట్ర గవర్నర్ సారా హుకాబీ చెప్పారు. ఎమర్జెన్సీని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అవసరమైన సాయం హామీ ఇచ్చినట్టు తెలిపారు. టోర్నడో ధాటికి అర్కాన్సాస్‌లోని వైన్ నగరం సగం ధ్వంసమైందని అక్కడి మేయర్ జెన్నీఫర్ హోబ్స్ అన్నారు. ఐయోవా నుంచి దక్షిణాది రాష్ట్రమైన మిసిసిపితో సహా చాలా రాష్ట్రాలకు టోర్నడో హెచ్చరికలు జారీ అయ్యాయి. చికాగో వెలుపల, ఇల్లినాయిస్ పట్టణంలోని బెల్విడెరేలో విపత్తు సంభవించింది. అపోలో థియేటర్‌లో ప్రదర్శన సమయంలో గాలుల ధాటికి పైకప్పుతో సహా ముందు భాగం కూలింది. ఈ ఘటనలో 28 మంది గాయపడగా.. తీవ్ర గాయాలతో ఐదుగురు ఆసుపత్రిలో చేరారు. దక్షిణ ఇల్లినాయిస్‌లోని క్రాఫోర్డ్ కౌంటీలో ఇల్లు కూలి ముగ్గురు చనిపోయారు. పక్కనే ఉన్న ఇండియానాలో ముగ్గురు మరణించారు. టోర్నడోల విధ్వంసానికి విద్యుత్ వ్యవస్థ దెబ్బతిని, లక్షలాది ఇళ్లు చీకట్లలోనే ఉన్నాయి.

నేపాల్ అధ్యక్షుడికి తీవ్ర అస్వస్థత

ఖాట్మండు: నేపాల్ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన దేశ రాజధాని ఖాట్మండులోని మహారాజ్‌గంజ్‌లో ఉన్న త్రిభువన్ యూనివర్సిటీ టీచింగ్ హాస్పిటల్‌లో చేరారు. అధ్యక్షుడు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారని, ప్రాణాపాయమేమీ లేదని వైద్యులు వెల్లడించారు. పౌడెల్ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని అధ్యక్షుడికి ప్రధాన సలహాదారు సురేశ్ ఛాలిసే తెలిపారు. నేపాల్ అధ్యక్షుడిగా రామచంద్ర పౌడెల్ ఈఏడాది మార్చి 10న ఎన్నికైన విషయం విదితమే.

నాసా 'మూన్ టు మార్స్' చీఫ్‌గా అమిత్ క్షత్రీయ

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా అధ్వర్యంలోని 'మూన్ టు మార్స్' హెడ్‌గా భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్-రోబోటిక్స్ ఇంజనీర్ అమిత్ క్షత్రీయ నియమితులయ్యారు. చంద్రుడిపై దీర్ఘకాలం ఉండటమే కాకుండా అక్కడ నుంచి అంగారక గ్రహంపైకి మానవులను తరలించే బృహత్ కార్యాన్ని లక్ష్యంగా చేసుకొని మూన్ టు మార్స్ మిషన్‌ను నాసా తలపెట్టింది. అమిత్ క్షత్రీయ నాసా అన్వేషణ వ్యవస్థల అభివృద్ధి మిషన్ డైరెక్టరేట్‌లో ఏర్పాటయ్యే కొత్త కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు. ఇప్పటి వరకు సంయుక్త అన్వేషణ వ్యవస్థల అభివృద్ధి విభాగానికి తాత్కాలిక డిప్యూటీ అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరించారు. 2003 నుంచి అంతరిక్ష మిషన్లలో ఆయన పని చేస్తున్నారు.

అపార నష్టం

(మొదటిపేజీ తరువాయి)

సాగుదారుడు వణికిపోతున్నాడు. సముచిత పరిహారం ఇచ్చి ఆదుకుంటారని ప్రభుత్వాలపై ఆశలు పెట్టుకున్నాడు.

భారత్‌లో గోధుమలు ఎక్కువగా పండుతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆహార భద్రతా సవాళ్లు, అంతర్జాతీయంగా అస్థిరత పరిస్థితులు నెలకొన్న సమయంలో అపారమైన అకాల నష్టం తీవ్రంగా ప్రభావం చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తంగా 5.23లక్షల హెక్టార్లలో గోధుమ పంటకు నష్టం వాట్లింది. పంజాబ్, హరియాణాలో పంట నష్టం అంచనా ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది 34 మిలియన్ హెక్టార్లలో గోధుమ సాగు చేశారు. 112.2 మిలియన్ టన్నుల దిగుమతిని 2022-23 పంట వత్సరం (జులై-జూన్)లో ప్రభుత్వం అంచనా వేసిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో గోధుమ సాగుతో పాటు ఇతర రబీ పంటలకు జరిగిన నష్టంపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సోమవారం సమీక్షించనున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహుజా ఆదివారం పీటీఐకి తెలిపారు. రబీలో గోధుమ ఎక్కువ పండుతుంది. పంటకోత సమయంలో అకాల వర్షాలతో అపార నష్టం అంచనా ఉంది. మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కనీస మద్దతు ధరకు ప్రొక్యూర్‌మెంట్ కూడా మొదలైంది.

రెండు వారాలుగా పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు, తీవ్ర గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది. దీంతో జరిగే నష్టం అంచనా రైతులను భయపెడుతోంది.

తాజా పరిస్థితుల్లో దిగుబడి తగ్గిపోతుందని పంజాబ్‌లోని మొహాలీ జిల్లా, బాదర్పూర్ గ్రామానికి చెందిన రైతు భూపిందర్ సింగ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎకరాకు 20 క్వింటాళ్లు రావాల్సి ఉంటే 10-11 క్వింటాళ్లు వస్తాయన్నారు. 34 ఎకరాల్లో గోధుమ సాగు చేయగా ఇప్పటికే తీవ్రగాలులకు కొంతమేరకు పంట నేలమట్టమైందని, సగటున 50శాతం నష్టం జరిగిందని, వాతావరణం ఇలానే ఉంటే పూర్తిగా నష్టపోతానని ఆయనన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రైతు అజయ్ సింగ్ మాట్లాడుతూ ఖజురహోలో తన రెండు ఎకరాల్లో గోధమ పంటకు తేమ ఎక్కువై పరుగు పట్టి గింజ నాణ్యత తగ్గిపోయిందని వాపోయారు.

మధ్యప్రదేశ్‌లో సుమారు 95లక్షల హెక్టార్లలో గోధమ సాగు చేయగా అందులో సుమారు లక్ష హెక్టార్లలో పంట నష్టం జరిగిందని ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ సీనియర్ అధికారి వెల్లడించారు. అటు రాజస్తాన్‌లోనూ 3.88 లక్షల హెక్టార్లలో గోధమ పంటకు నష్టం జరిగింది. మొత్తం 29.65లక్షల హెక్టార్లలో పంట వేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గోధుమతో పాటు ఆవాలు, శెనగ, బార్లీ, ఇతర కూరగాయల పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. 1.54 లక్షల హెక్టార్లలో ఆవాలు, 1.29లక్షల ఎకరాల్లో శెనగ పంటలు దెబ్బతిన్నాయి. ఉత్తర ప్రదేశ్‌లోనూ 35వేల హెక్టార్లలో గోధమ పంటకు నష్టం జరిగిందని ఆ రాష్ట్ర ఉపశమన కమిషన్ వెల్లడించింది. ఆగ్రా, బరేలీ, చందౌలీ, హమీర్‌పూర్, ఝూన్సీ, లలిత్‌పూర్, ప్రయాగ్‌రాజ్, ఉన్నావో, వారణాసితో కలిపి మొత్తం తొమ్మిది జిల్లాల్లో నష్టం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. 1.25లక్షల గోధుమ రైతులపై అకాల వర్షం ప్రభావం కనిపించిందని, వీరిలో 43,142 మంది రైతుల నష్టసమాచారం తమ వద్ద ఉన్నదని కమిషనర్ ప్రభు ఎన్ సింగ్ తెలిపారు. డేటా సేకరణ పూర్తైన తర్వాత రైతులకు పరిహారం అందుతుందన్నారు. ఇదిలా ఉంటే పంట నష్టం అంచనా వేసే ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని తమ రాష్ట్రాల సంబంధిత అధికారులకు పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు ఆదేశాలిచ్చాయి. ఈ-ఫసల్ పోర్టల్‌లో నష్టాన్ని నమోదు చేసుకుంటే, తదనుగుణంగా పరిహారాన్ని మే నెలలో ఇస్తామని రైతులకు హరియాణా సీఎం ఖట్టర్ సూచించారు. పంజాబ్ ప్రభుత్వం ఇప్పటికే నష్టపరిహారాన్ని 25శాతం పెంచింది.

పరువునష్టం కేసుపై రాహుల్ అప్పీల్

(మొదటిపేజీ తరువాయి)

కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సూరత్ కోర్టు రాహుల్ గాంధీని దోషిగా పేర్కొంటూ రెండేళ్ల జైలు శిక్ష విధించింది. 30 రోజుల పాటు బెయిలు మంజూరు చేసింది. అనంతరం ఆయన లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడని పార్లమెంటు సచివాలయం ప్రకటించింది. అయితే ఈ కోర్టు తీర్పుపై అప్పీలు చేసుకునే అవకాశం రాహుల్ గాంధీకి ఉంది. రాహుల్ గాంధీ దోషి అని మేజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును ఉన్నత న్యాయస్థానాలు నిలిపివేయకపోతే, ఎన్నికల కమిషన్ ఆయన ప్రాతినిధ్యం వహించిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించవలసి వస్తుంది. రానున్న ఎనిమిదేళ్లపాటు ఆయన ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పార్లమెంటు సచివాలయం రద్దు చేయడంపై కాంగ్రెస్ సహా విపక్షాలు తప్పుబడుతున్నాయి. చెల్లాచెదురుగా ఉన్న ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యేందుకు ఇదొక అవకాశంగా మారింది.

మరో జేడీఎస్ ఎమ్మెల్యే రాజీనామా

సిర్సి: కర్నాటక అసెంబ్లీకి మే10న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జేడీఎస్‌కు చెందిన సీనియర్ ఎమ్మెల్యే కె.ఎం. శివలింగెగౌడ ఆదివారం శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సిర్సిలో ఆయన తన రాజీనామా లేఖను శాసనసభ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కగేరీకి అందజేశారు. మూడుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన ఆయన కాంగ్రెస్‌లో చేరతారని, ఆయన్ను అర్సికెరె నుంచి పోటీకి దింపవచ్చని భావిస్తున్నారు.

కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తున్న పాలకులు

రామచంద్రయ్య విమర్శ

విశాలాంధ్ర-పుట్టపర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యక్తుల కొమ్ముకాస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య విమర్శించారు. ఆదివారం సత్యసాయి జిల్లా సీపీఐ కార్యవర్గం సమావేశం జరిగింది. రామచంద్రయ్య మాట్లాడుతూ మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేయడం దారుణమన్నారు. 2024 ఎన్నికలలో రాహుల్ గాంధీ పోటీ చేయకుండా చేయడమే ఇందుకు కీలకంగా కనిపిస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్ పెద్దల అవినీతిని వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న ధరలు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ఏప్రిల్ 14 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు చేపట్టిన ప్రచారయాత్రను జయప్రదం చేయాలని కోరారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల భూకబ్జాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అరకొర నిధులు కేటాయించి సవతితల్లి ప్రేమ చూపిందని ఆరోపించారు. తుంగభద్ర నుంచి రాయలసీమకు నీరు రావడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే శ్రీశైలం ప్రాజెక్టుకు చాలా ఇబ్బంది ఎదురవుతుందన్నారు. రాయలసీమలో అందరూ ఏకమై నీటి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేశ్ చేసిన అవినీతి ఆరోపణలను కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు రుజువు చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రశాంతంగా ఉన్న పుట్టపర్తి వైసీపీ, టీడీపీ చర్యల కారణంగా రణరంగంగా మారిందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ కుట్రలు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

వసతుల కల్పన, అభివృద్ధి పేరిట గతిశక్తి వంటి కార్యక్రమాలతో ముడిపెట్టి కేంద్రం గొప్పలు చెప్పుకుంటోంది కానీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు అత్యంత కీలకమైన స్టీల్ ఉత్పత్తిని పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని చూడటం కేంద్ర ప్రభుత్వ నిబద్ధత లోపాన్ని తేటతెల్లం చేస్తుందని స్పష్టంచేశారు. ఒకప్పుడు ప్రభుత్వ రంగంలో భారీ ఎత్తున సిమెంట్‌ను ఉత్పత్తి చేసిన పరిశ్రమలన్నింటిని పూర్తిగా ప్రైవేటుపరం చేసిన కేంద్రంలోని ప్రభుత్వాలు, ప్రస్తుతం స్టీల్ పరిశ్రమను కూడా అదే రీతిన ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసే ముందు, దాన్ని నష్టాల పాలుచేసి, వాటిని సాకుగా చూపించి లక్షల కోట్ల విలువైన ఆస్తులను అప్పనంగా ప్రైవేట్ కార్పొరేట్ మిత్రులకు అప్పజెప్పేందుకు కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ప్రత్యేక ఐరన్ ఓర్ గనులను కేటాయించకుండా కేంద్రం మోకాలడ్డిందని తెలిపారు. దీంతో విశాఖ ఉక్కు తన ఉత్పత్తి ఖర్చులో 60 శాతం వరకు పూర్తిగా ముడిసరుకుపైనే ఖర్చు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు ప్రైవేట్ కంపెనీలకు ఇబ్బడిముబ్బడిగా ఐరన్ ఓర్, బొగ్గు, ఇతర గనులను కేటాయించడం వల్ల వారి ఉత్పత్తిలో ముడి సరుకుల ఖర్చు కేవలం 40 శాతం లోపే ఉన్నదని చెప్పారు. పెద్ద ఎత్తున ముడి సరుకు పైనే ఖర్చు చేయాల్సి రావడంతో.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి విషయంలో ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలతో పోటీపడటంలో కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని, మార్కెట్‌లో వాటితో సమాన ధరకు అమ్మాల్సి రావడంతో నష్టాలను ఎదుర్కొంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు.

వర్కింగ్ క్యాపిటల్ పేరుతో...

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కి 7.3 ఎంటీపీఏ సామర్థ్యం ఉన్నా... కేవలం ముడి సరుకును, మూలధనాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల పూర్తిస్థాయి కెపాసిటీతో పనిచేయలేకపోతోందని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న 50 శాతం సామర్థ్యానికి కూడా 100 శాతం కెపాసిటి ఉత్పత్తికి అయ్యే ఖర్చే అవుతుందని మంత్రి చెప్పారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తే పూర్తిస్థాయి సామర్థ్యంతో పని చేయడం వల్ల అనేక ఖర్చులు కలిసి వచ్చి విశాఖ ఉక్కు లాభాల బాట పడుతుందని స్పష్టంచేశారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కును వర్కింగ్ కాపిటల్ పేరుతో ప్రైవేట్ కంపెనీలతో కలిపే ప్రయత్నాన్ని పూర్తిగా విరమించుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. దీనికి బదులు కేంద్ర ప్రభుత్వమే అందుబాటులో ఉన్న ఇతర మార్గాల ద్వారా కర్మాగారాన్ని బలోపేతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) దాదాపు రూ.లక్ష కోట్లతో తన విస్తరణ ప్రణాళికలను ప్రకటించిందని చెప్పారు. లక్ష కోట్ల రూపాయలతో గ్రీన్ ఫీల్డ్‌లో భారీ విస్తృత ప్రణాళిక ప్రకటించిన ఈ సంస్థను వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో కలపవచ్చని సూచించారు. దీంతో తక్కువ ధరకి ప్రైవేట్ సంస్థలకు అమ్మడం కంటే కేంద్ర ప్రభుత్వమే ఇంకో ప్రభుత్వ రంగ సంస్థతో కలపడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సెయిల్ సంస్థ విస్తరణ లక్ష్యానికి కూడా ఇది ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సెయిల్ ఈ దిశగా ముందుకు వస్తే తెలంగాణ ప్రభుత్వం ఎన్నాళ్లుగానో డిమాండ్ చేస్తున్న బయ్యారం స్టీల్‌ప్లాంట్‌తో పాటు కడపలోనూ మరో ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఈకో సిస్టం ఏర్పడుతుందన్నారు.

రుణ సౌకర్యం కల్పించాలి

దాదాపు లక్షన్నర కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన విశాఖ ఉక్కు ప్రస్తుతం దాదాపు రూ.25వేల కోట్ల వరకు మాత్రమే రుణాల మానిటైజేషన్ చేసుకోవడానికి కేంద్రం అవకాశం కల్పించిందని తెలిపారు. అయితే అదే స్థాయిలో ఆస్తులు లేదా విలువ కలిగిన ప్రైవేట్ కంపెనీలకు మాత్రం దాదాపు 70 నుంచి 80 వేల కోట్ల రూపాయల వరకు రుణాలను పొందగలిగే సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ప్రైవేట్ కంపెనీలతో సమానంగా కేంద్ర ప్రభుత్వం రుణ సౌకర్యాన్ని కల్పించి, బ్యాంకుల ద్వారా మరింత మూలధనాన్ని ఇప్పిస్తే వైజాగ్ విశాఖ ఉక్కు తన కార్యకలాపాలను ప్రైవేటు కంపెనీలతో సమానంగా పోటీపడేలా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపాలని కోరారు.

తక్షణం రూ.5వేల కోట్లు ఇవ్వాలి

కేంద్ర ప్రభుత్వమే తక్షణం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి అవసరమైన మేరకు కనీసం రూ.5వేల కోట్లు కేటాయించాలని కేటీఆర్ సూచించారు. గతంలో ప్రధాన మంత్రులుగా పనిచేసిన పీవీ నరసింహారావు, అతల్ బిహారీ వాజ్‌పేయిల హయాంలో ఇదేవిధంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి నిధులను నేరుగా కేటాయించిన ఉదంతాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోరుతున్నట్టు.. సుమారు రూ.5 వేల కోట్లు కేటాయించి, అందుకు సరిపడా ఈక్విటీని కేంద్ర ప్రభుత్వం తీసుకోవచ్చన్నారు.

ఆ నోటీసును రద్దుచేయాలి

ప్రస్తుతం మూలధనం అందించి స్టీల్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే పేరుతో ఏర్పాటు చేసిన ఆసక్తి వ్యక్తీకరణ నోటీసును కేంద్రం వెంటనే రద్దు చేయాలన్నారు. దీని బదులు కేంద్ర ప్రభుత్వమే దేశంలో భారీ ఎత్తున చేపడుతున్నామని చెప్పుకుంటున్న మౌలిక వసతుల ప్రాజెక్టులకు వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి నేరుగా స్టీల్‌ని కొనుగోలు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి అడ్వాన్స్ సొమ్ములను అందించి, స్టీల్ కోనుగోలు చేస్తే సరిపోతుందన్నారు.

ప్రజలను చైతన్యవంతం చేస్తాం

బీఆర్ఎస్ పార్టీగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి తమకు ఉన్నదని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా తమ అనుకూల ప్రైవేట్ కంపెనీకి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని అప్పజెప్పాలన్న కుట్రను చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీన్ని ఎదుర్కొని వైజాగ్ స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగాల భవిష్యత్తును కాపాడాలన్న ఏకైక లక్ష్యంతో వారితో కలిసి పని చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందుకోసం కలిసి వచ్చే శక్తులు, ప్రజాసంఘాలు, పార్టీలతో కలసి ప్రజలను మరింత చైతన్యవంతం చేస్తామన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ తెలుగు ప్రజల హక్కు అని, దాన్ని కాపాడుకోవడం కోసం తెలుగువారందరు కలిసి రావడం అవసరమని భావిస్తున్నామన్నారు.

టెన్షన్...టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారు. దానికితోడు వలంటీర్ల వ్యవస్థతో ఎమ్మెల్యేలకు ప్రజలతో సంబంధం లేకుండా పోయిందని, తామంతా ఉత్సవ విగ్రహాల్లా ఉన్నామంటూ కొందరు ఎమ్మెల్యేలు వాపోతున్నట్లు సమాచారం. జిల్లా మంత్రులు, పరిశీలకులకు, ఎంపీలకు మధ్య సమన్వయం లేకపోవడంతో ఎమ్మెల్యేలు ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియని దుస్థితి నెలకొంది. ఎక్కడికక్కడే జిల్లాల్లో పార్టీ మధ్య గ్రూపులు ఏర్పడటంతో ద్వితీయ, తృతీయశ్రేణి నాయకత్వానికి గుర్తింపు లేకుండా పోయింది. దీంతో వారంతా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలతో కలిసి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు.

40 మందికి టికెట్లు కష్టమే?

రాబోయే ఎన్నికల్లో 40 మంది సిట్టింగ్‌లకు టికెట్లు కష్టమేనని తెలుస్తోంది. దీనిపై పార్టీ ముఖ్యనేతల సమావేశంలో సీఎం జగన్ తేల్చిచెబుతారని సమాచారం. గడపగడపకూ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు సరిగ్గా నిర్వహించలేకపోయారు. దీంతో వారి పనితీరుపై గత సమావేశాల్లో సీఎం జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడం కష్టమేనంటూ నేరుగా అందరి ముందూ నొక్కిచెప్పారు. దాంతో కొందరు అసంతృప్తి చెందారు. ఇప్పటికే నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి దూరమయ్యారు. వారంతా టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. 40 మంది సిట్టింగ్‌లకూ టికెట్లు ఇవ్వకుంటే వారంతా అధిష్ఠానంపై తిరగబడే అవకాశముంది. అలాంటి వారిని గుర్తించి ముందు సర్దిచెప్పడం...లేకపోతే తెగేసి చెప్పే రీతిలో జగన్ ఉన్నట్లు సమాచారం.

కేబినెట్ 3.0 ఉండేనా?

రాష్ట్ర కేబినెట్‌లో కొంతమంది మంత్రుల పని తీరుపై జగన్ అసంతృప్తిగా ఉన్నారు. దీంతోపాటు రెండో విడత కేబినెట్‌లో క్షత్రియ, కమ్మ, ఆర్యవైశ్య సామాజిక వర్గాలకు చోటు దక్కలేదు. ఆ కేబినెట్ కూర్పుపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. దీనిని గుర్తించిన సీఎం...రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేబినెట్‌లో స్వల్పమార్పులు చేసి, ముగ్గురికి చోటు కల్పిస్తారని సమాచారం. పనితీరు బాగోని మంత్రులను తొలగించి, వారి స్థానంలో కొత్త వారికి స్థానం కల్పించే అవకాశాలున్నాయి.

శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీల బలం 43కు చేరింది. శాసనమండలి నుంచి ఇద్దరికి ప్రాతినిధ్యం కల్పించేలా అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కమ్మ సామాజిక వర్గం నుంచి గుంటూరు జిల్లా నుంచి మర్రి రాజశేఖర్‌కు అవకాశం కల్పిస్తారని సమాచారం. మొత్తంగా వైసీపీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో జరగనున్న సమావేశం కీలక నిర్ణయాలకు వేదికగా నిలవనుంది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్ని ప్రభుత్వ, విద్యాసంస్థల యాజమాన్యాల పరిధిలో నడుస్తున్న పాఠశాలలకు (1-9 తరగతుల విద్యార్థులకు) 2022-23 విద్యాసంవత్సరానికిగాను ఈనెల 3వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీజేశారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయి. రెండో శనివారమూ పనిదినంగా పరిగణించి, ఆ రోజూ ఒంటిపూట బడి నిర్వహిస్తారు. ఒంటిపూట బడులను నిర్ణీత సమయంలో అన్ని పాఠశాలల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

నేటి నుంచి పది పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

కానున్నారు. వారిలో బాలురు-3,11,329, బాలికలు-2,97,741 ఉన్నారు. పది సప్లిమెంటరీ పరీక్షలకు 53,410 మంది హాజరవుతారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో అత్యధికులు కాగా, అత్యల్పంగా పార్వతీపురం, మన్యం అల్లూరి సీతారామరాజు, బాపట్లలో ఉన్నారు. మొత్తం 3,349 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి గదికి కేవలం 24 మంది విద్యార్థులు మాత్రమే ఉండేటట్లు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. మొత్తం 838 స్క్వాడ్‌లు నియమించగా, వారిలో సిట్టింగ్ స్క్వాడ్‌లు 682, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 156 ఉన్నాయి. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి అవసరమైన చోట సిట్టింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది నూతనంగా 104 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకువెళ్లేందుకు అనుమతించబోరు. ఉపాధ్యాయులు, సిబ్బంది సెల్‌ఫోన్‌లను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మొబైల్ కౌంటర్‌లో ఇవ్వాలి. పరీక్షా కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే 1997 నాటి యాక్ట్-25 (మాల్ ప్రాక్టీసెస్ నిరోధక చట్టం) ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీజేశారు. గతంలో అక్రమాలకు పాల్పడ్డ 75 మంది ఉపాధ్యాయులపై ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు వెనక్కు తీసుకున్నామని, వారు పరీక్ష సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఉండనవసరం లేదని, వారికి ఎలాంటి ఇన్విజిలేషన్ డ్యూటీలు వేయలేదని విద్యాశాఖ తెలిపింది. ప్రశ్నపత్రాన్ని ఎవరైనా సామాజిక మాధ్యమాల ద్వారా పరీక్షకు ముందుగానీ, పరీక్ష జరిగే సమయంలో కానీ బయటికి పంపితే ఆ ప్రశ్నపత్రం ఏ కేంద్రం నుంచి...ఏ విద్యార్థి వద్ద నుంచి వచ్చిందో తెలుసుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షలకు హజరయ్యే విద్యార్థులందరికీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా అంధ విద్యార్థుల కోసం వారే స్వయంగా కంప్యూటర్‌పై పరీక్ష రాసుకునే ఏర్పాట్లు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

యువకుడు హత్యకు గురై తన కారులోనే సజీవ దహనం అయ్యాడు. ఈ దారుణ ఘటన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండల పరిధిలో బొప్పారాజు పల్లి పరిధి కనుమ వద్ద జరిగింది. శనివారం రాత్రి 11 గంటలకు కారు మంటల్లో కాలుతూ ఒక వ్యక్తి కాలిపోతున్నట్లు రహదారి పై వెళ్లే వాహన చోదకులు పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రగిరి, రామచంద్రాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కారులో యువకుడు పూర్తిగా కాలిపోయి ఉన్నాడు. కారుకు ఉన్న నంబర్ ప్లేట్ ఆధారంగా వివరాలు తెలుసుకున్న పోలీసులు చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన జయరామయ్య కొడుకు నాగరాజు (38) గా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మృతుని కుటుంబ సభ్యులు మంటల్లో కాలిబూడిద అయిన నాగరాజు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి జయరామయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికులు అందించిన కథనం మేరకు వెదురుకుప్పం మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన చాణిక్య ప్రతాప్, అతని తమ్ముడు రిపింజయకు, అదే గ్రామానికి చెందిన జయరామయ్య కుమారులు నాగరాజు, పురుషోత్తం మధ్య నెల రోజులుగా వివాహేతర సంబంధంపై గొడవలు జరుతున్నాయి. పురుషోత్తంను అనేక సార్లు బెదిరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించుకునే ఉద్దేశంతో అన్న నాగరాజు వివాహేతర సంబంధం ఆరోపణలు ఎదుర్కొంటున్న తన తమ్ముడు పురుషోత్తంను బెంగుళూరుకు పంపేశాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రాజీ కుదుర్చుకోవడానికి నాగరాజు బ్రాహ్మణపల్లికి చేరుకొని మధ్యవర్తి గోపీనాథ్ రెడ్డితో చాణిక్య ప్రతాప్, రిపింజయతో కలిసి సామరస్యంగా చర్చించి, గొడవలు లేకుండా చూడాలని వెళ్లినట్లు చెప్పారు. అయితే బ్రాహ్మణపల్లికి సుమారు 7 కిలోమీటర్లు దూరంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుపై పథకం ప్రకారమే నాగరాజును హత్య చేసి కారులో పెట్టి సజీవదహనం చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వివాహేతర సంబంధంపై పగలు పెంచుకున్న రిపింజయ, చాణిక్య ప్రతాప్‌లే నాగరాజును హత్య చేసారా లేదా బయట వ్యక్తుల చేత చేయించారా అన్న విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ ఘటనపై ఏఎస్పీ వెంకట్రావు మాట్లాడుతూ బ్రాహ్మణపల్లికి చెందిన రిపింజయ, కొందరు పథకం ప్రకారమే హత్య చేశారని మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు. కాగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగరాజును కారులో సజీవ దహనం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పథకం ప్రకారమే నాగరాజును బొప్పరాజుపల్లి ఘాట్ రోడ్డు వద్దకు పిలిపించి హత్య చేశారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలను పోలీసులు తీవ్రంగా పరిగణించాలని కోరారు.

ముదిరిన వైసీపీ వర్గపోరు

- విశాఖ దక్షిణం గణేశ్‌కు దక్కేనా?
- సీతంరాజు సుధాకర్, గురువులు కన్ను దానిపైనే
- కొత్తగా తెరపైకి శ్రీవాత్సవ



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం విశాఖ వైసీపీ నేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి చెందిన అధికార పార్టీ అభ్యర్థి ఇప్పుడు అసెంబ్లీ వైపు చూస్తున్నారా? అసెంబ్లీ టికెట్ కోసం పట్టుబడితే అధిష్ఠానం సిట్టింగ్ ఎమ్మెల్యేకు మొండిచేయి చూపుతుందా? అంటే అవుననే అంటున్నారు పార్టీలో కొంతమంది నేతలు. తనకు టికెట్ వస్తుందా? రాదా? అన్న ఆందోళన నేతల్లో మొదలైంది. ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న చందంగా ఉంది ఇప్పుడు విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరిస్థితి. 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. ఆ తర్వాత ఆయన వైసీపీలో చేరారు. టీడీపీలో ఉన్నప్పుడు జగన్‌పైనా, వైసీపీ సర్కారుపైనా గణేశ్ విరుచుకు పడేవారు. విన్నూత రీతిలో నిరసనలు చేశారు. ఇదంతా గుర్తుపెట్టున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు వైసీపీలోకి వచ్చినా ఎమ్మెల్యే గణేశ్‌ను టీడీపీ నేతగానే చూస్తున్నారు. ఆయన నాయకత్వంలో పని చేయడానికి ఎంతమాత్రం ఇష్టపడటం లేదని వైసీపీ వర్గాలు అంటున్నాయి. అందుకే దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లికి వ్యతిరేకంగా మూడు, నాలుగు గ్రూప్‌లు పనిచేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సీతంరాజు సుధాకర్... వాసుపల్లికి వ్యతిరేకంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేదలకు కుట్టుమిషన్లు, దుస్తుల పంపిణీ, గర్భిణిలకు సామూహిక సీమంతాలు చేస్తూ నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేకవర్గాన్ని తయారు చేసుకున్నారు. ఈ పరిణామాలు వాసుపల్లికి మింగుడు పడటం లేదు. ఇదేసమయంలో దక్షిణ నియోజకవర్గ టికెట్ కేటాయింపుపై సుధాకర్‌కు అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు ఆయన వర్గీయులు ప్రచారం ప్రారంభించారు. వాసుపల్లి వర్గీయులు మాత్రం టికెట్ తమదేనని ధీమాగా చెబుతున్నారు. మరోపక్క మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు ఇదే నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కోలా గురువులను దురదృష్టం వెంటాడిందని చెప్పొచ్చు. సీఎం జగన్ కోలా గురువులను కరుణించి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ స్థానం ప్రకటించినప్పటికీ క్రాస్ ఓటింగ్ కారణంగా ఆయన ఓటమి పాలయ్యారు. దీంతో వచ్చే ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి గురువులకు టికెట్ వస్తుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఇద్దరు అభ్యర్థులకు ఎమ్మెల్సీ టికెట్లు ప్రకటించినప్పటికీ...ఆ ఇద్దరు ఓటమి చెందడంతో వారు కూడా దక్షిణం వైపు చూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆర్థికంగా నష్టపోయినందున తనకు ఎలాగైనా దక్షిణం టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని సుధాకర్ కోరినట్లు తెలిసింది. సుధాకర్‌కు వైయస్ కుటుంబంతో మొదటి నుంచి మంచి సంబంధాలు ఉండడంతో ఆయనకే అవకాశలు మెండుగా ఉంటాయని సీతంరాజు వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారు. ఇక ద్రోణంరాజు శ్రీనివాస్ తనయుడు ద్రోణంరాజు శ్రీవాత్సవను కూడా ఆదుకుంటామని సీఎం జగన్ గతంలో హామీ ఇచ్చారు. అందువల్ల ఆయన కూడా ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పుడు ఈ నియోజకవర్గం అధిష్ఠానం అధిష్ఠానానికి తలనొప్పిగా మారినట్లు తెలు స్తోంది. విశాఖలో దక్షిణ నియోజకవర్గంలోనే వర్గపోరు అధికంగా ఉంది.

దళిత, మైనార్టీలపై దాడులను నిరసిస్తూ...
రేపు విజయవాడలో రౌండ్‌టేబుల్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళితులు, మైనార్టీలపై రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అకృత్యాలను నిరసిస్తూ సీపీఐ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి అధ్వర్యాన ఈ నెల 4వ తేదీన విజయవాడ దాసరి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో మైనార్టీ నాయకులు ఫారూఖ్ షుబ్లీ, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అఫ్సర్... రామకృష్ణతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. రామకృష్ణ మాట్లాడుతూ మైనార్టీలు, దళితులపై పదేపదే దాడులు జరుగుతున్నప్పటికీ సీఎం వైఎస్ జగన్ ఏమాత్రమూ స్పందించడం లేదన్నారు. సాక్షాత్తూ సీఎం జగన్ సొంత జిల్లా అయిన కడపలో పశుసంవర్థక శాఖలో జిల్లాస్థాయి అధికారైన డాక్టర్ అచ్చన్నను కిడ్నాప్ చేసి హత్య చేయడం అమానుషమని, దాదాపు 75 ప్రాంతాల్లో ఒక్క మైనార్టీల పైనే దాడులు కొనసాగినట్లుగా తెలుస్తోందన్నారు. ఎంత దారుణ పరిస్థితులు దళిత, మైనార్టీలు ఎదుర్కొంటున్నప్పటికీ జగన్‌కు కనీసం చలనం లేకపోవడం విచారకరమన్నారు. మైనార్టీలు, దళితులపై జరుగుతున్న అకృత్యాలను, దాడులను నిరసిస్తూ ఈనెల 4వ తేదీన జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి దళిత, మైనార్టీ, ప్రజా సంఘాలను, వివిధ రాజకీయ పార్టీల వారిని ఆహ్వానించామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించేంతవరకు ఈ అంశంపై ఒత్తిడి పెంచుతామని హెచ్చరించారు.

విశాఖ ఉక్కు కోసం మాట్లాడారా?

జగన్ దిల్లీ పర్యటనపై ఓబులేసు ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో -రాజమహేంద్రవరం: ఇన్నిసార్లు దిల్లీ వెళ్లిన మీరు.. ఏ రోజైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, విశాఖ ఉక్కు వంటి అంశాలపై చర్చించారా? అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు ప్రశ్నించారు. ఈ అంశాల్లో రాష్ట్రానికి నష్టం జరుగుతున్న క్రమంలో తక్షణమే కేంద్రంతో తగు విధంగా వ్యవహరించని పక్షంలో మోదీతో పాటు జగన్‌ను గద్దెదించేందుకూ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ ఏపీ పేపర్ మిల్స్ యాజమాన్య పరంపర విధానం కారణంగా కార్మికులకు అన్యా యం జరుగుతుందన్నారు. తాజాగా ఆత్మహత్య చేసుకున్న మిల్లు కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, మిల్లు అసోసియేట్ డైరెక్టర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14 నుంచి మే 15వ తేదీ వరకు సీపీఐ తలపెట్టిన 'బీజేపీ హటావో- దేశ్ బచావో' ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని ఓబులేసు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ నాయకులు బీవీ కొండలరావు, సత్తిబాబు, కోంద్రపు రాంబాబు, వంగమూడి కొండలరావు, రమణ, ఎంఎస్ రాజు, జేపీ రామారావు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

లోకేశ్‌కు ఏపీ చేనేత కార్మిక సంఘం వినతి

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్: చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు ఏపీ చేనేత కార్మిక సంఘం విన్నవించింది. ఈ మేరకు వినతిపత్రాన్ని సంఘం నాయ కులు జింకా చలపతి, వెంకటస్వామి, వెంకట నారాయణ అందజేశారు. వైసీపీ హయాంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి నోచుకోలేదని చెబుతూ తమకు న్యాయం జరిగేలా చూడాలని లోకేశ్‌ను కోరారు. చేనేతలకు రిజర్వేషన్ల అమలు కోసం నమోదు చేసుకునే కార్యాలయాన్ని ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని, చేనేత కార్మికులకు సిల్క్ రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని, ప్రతి చేనేత కుటుంబానికి 150 యూనిట్ల ఉచితవిద్యుత్ ఇవ్వాలని, నేతన్న నేస్తం కల్పించాలని, చేనేతలపై జీఎస్టీ ఎత్తివేయాలని, సబ్సిడీపై ముడిసరుకు సరఫరా, ఉత్పత్తుల అమ్మకానికి మద్దతు ధర కల్పన, ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ల ఏర్పాటు, ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ఇవ్వాలన్న తమ డిమాండ్లను లోకేశ్ దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. తమ డిమాండ్ల సాధనకు తన వంతు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, మంజునాథ్, వెంకటనారాయణ, రవికుమార్, రమణ, సురేశ్ ,మల్లికార్జున, కేశవ, మద్దిలేటి, నాగరాజు పాల్గొన్నారు.

జగన్ దిల్లీ పర్యటనతో ఒరిగిందేమిటి?

- ప్రధానిని ఎగువ భద్రపై ఎందుకు నిలదీయలేదు
- ఏపీకీ ప్రత్యేక హోదాపై ప్రశ్నించారా?
- మీ పర్యటనల ప్రయోజనం ఏమిటో ప్రజలకు చెప్పండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-నందిగామ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిల్లీ పర్యటనలతో సాధించిందేమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య సూటిగా ప్రశ్నించారు. ఇంతకుముందు, ప్రధాన మంత్రిని, హోం మంత్రిని కలిసిన ముఖ్యమంత్రులు రాష్ట్రం కోసం ఏమి కావాలని అడిగారో... ఆ వినతి పత్రాన్ని మీడియాకు ఇవ్వడంతో పాటు అందుకు కేంద్రం ఇచ్చిన హామీ ఏమిటో చెప్పేవారని అన్నారు. అయితే ఈ సీఎం మాత్రం ప్రత్యేక విమానంలో వెళతారు... వస్తారు కానీ... ఏం అడిగారో చెప్పరని తెలిపారు. రాష్ట్రానికి ఏదైనా సాధించి ఉంటే సీఎం పర్యటనలపై అనుమానాలు వచ్చేవి కావని అన్నారు. ఈ పర్యటనలు సొంత పనుల కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసమని నమ్మేదెలా?, దిల్లీ పర్యటనల మర్మం ఏమిటో సీఎం గారు కాస్త చెప్పరు...? అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం స్థానిక రైతు పేట చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిల్లీకి రాష్ట్రాల ముఖ్యమంత్రుల అధికారిక పర్యటనలు, రాష్ట్రాల ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయని అందరికీ తెలుసని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి... ప్రధాని మోదీని, హోం మంత్రి అమిత్ షాను కలుసుకొన్నంత తరచుగా ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, చివరకు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహితం కలుసుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ఇన్ని భేటీలతో ఆంధ్రప్రదేశ్‌కు ఒనగూడిన ప్రయోజనం ఏమైనా ఉందా అని ఈశ్వరయ్య ప్రశ్నించారు. నాలుగేళ్లలో సీఎం జగన్ దిల్లీ పర్యటనల వల్ల ఫలితం శూన్యమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో పొందుపరచిన హక్కులతో సమానమైన కడప ఉక్కు కర్మాగారం, రాయలసీమ-ఉత్తరాంధ్ర అభివృద్ధి పథకం, ఓడరేవు, రైల్వే జోన్ (ఆమోదం పొందిన విశాఖలో), రెవెన్యూ లోటు భర్తీ (ఓ నాలుగు వేల కోట్లు తప్ప), పోలవరం ప్రాజెక్టు డీపీఆర్-2 కు ఆమోదం- నిధుల మంజూరు, పారిశ్రామికాభివృద్ధికి పన్నుల్లో రాయితీ, ఉమ్మడి ఆస్తుల పంపిణీ, వగైరా వగైరా ఒక్కటంటే ఒక్క హామీ (నిధుల లేమితో నడుస్తున్న విద్యా సంస్థలు మినహా) అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సీఎం సొంత జిల్లా కడపకు సంబంధించిన ఉక్కు ఫ్యాక్టరీ మీదగాని కడప-బెంగళూరు రైలు మార్గం పైన గాని ఆయన మాట వరుసకైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. అక్రమంగా ఎగువ భద్రను నిర్మాణం చేపట్టడం, జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించి తుంగభద్ర నీటిని ఆపడం వల్ల రాయలసీమ జిల్లాలయిన కడప, కర్నూలు, అనంతపురం ప్రాంతాలకు నష్టం జరుగుతున్నా, పోలవరం ఎత్తు విషయంలో భిన్న ప్రకటనలు వస్తుంటే ప్రధాన మంత్రితో మీరేం చర్చించారని, రాయలసీమ ఎడారిగా మారుతుంటే రాయలసీమ గోసను ప్రధానికి మాట వరుసకైనా చెప్పారా అని అన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని నిర్ద్వందంగా మోదీ ప్రభుత్వం తిరస్కరిస్తుంటే ప్రశ్నించకుండా ముఖ్యమంత్రి దిల్లీకి వెళ్లి ఏం ప్రయోజనమని మండిపడ్డారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని వందకు వంద శాతం అమ్మేస్తామని మోదీ ప్రభుత్వం తెగేసి చెబుతుంటే దిల్లీ పర్యటనలో అడగాలని అనిపించలేదా, ఇలా ముఖ్యమంత్రి పర్యటనల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమిటో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక విమానాల్లో ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేసిన ప్రజల డబ్బు వృథా చేస్తూ రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టడం ఎంత వరకు సమంజసం అంటూ గుజ్జల ఈశ్వరయ్య ఎద్దేవా చేశారు. వరుస దిల్లీ పర్యటనలపై ప్రధానితో పాటు ఇతర మంత్రుల భేటీలో జరిగిన వాటిని ముఖ్యమంత్రి బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా డిప్యూటీ సెక్రెటరీ దోనేపుడి శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు జి.కోటేశ్వర రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, నియోజక వర్గ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, జిల్లా సమితి సభ్యులు తాటి పైడియ్య పాల్గొన్నారు.

'మోదీ హటావో, దేశ్ బచావో' జయప్రదం చేయాలి: డేగా పిలుపు

విశాలాంధ్ర -కాకినాడ: ఈనెల 14 తేదీ నుంచి దేశ వ్యాప్తంగా మోదీ హటావో దేశ్ బచావో నినాదంతో చేపట్టే ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సీపీఐ రామచంద్రాపురం జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ చెలికాని రామారావు స్మారక భవనంలో కాగొరిపర్తి రాజు ఆధ్యక్షతన జరిగింది. సమావేశానికి డేగా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రచార జాతాలు, పాదయాత్రలు నిర్వహించాలని సూచించారు. 'మోదీ హటావో, దేశ్ బచావో' ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలన్నారు. విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు వంటివాటిలో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రధాని మోదీ ఎదుట మోకరిల్లి రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టడం గర్హనీయమని అన్నారు. జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు జిల్లా స్థాయి సమస్యలు, దళితులపై దాడులను నిరసిస్తూ విజయవాడలో మంగళవారం నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశం గురించి తెలిపారు. రామచంద్రాపురం నియోజకవర్గం ఏఐటీయూసీ జిల్లా మహాసభ జరపాలని ప్రతిపాదించారు. సమావేశాన్ని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము ప్రారంభించారు.

విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుంటే
రాజ్‌భవన్ ముట్టడిస్తాం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుంటే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి హెచ్చరించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయలేదని, దీంతో బోధన చేసేవారు లేకపోవడం వలన విద్యార్థులకు నష్టం జరుగుతోందని అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో రాజ్ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి నేడు విద్యార్థులకు విద్యను అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల వేల పాఠశాలలు మూతపడ్డాయని, లక్షలాది మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల మధ్య మత ఘర్షణలు తీసుకొచ్చి పాఠశాల దగ్గర మొదలుకొని విశ్వవిద్యాలయాల స్థాయి వరకు ఈ మతఘర్షణలు విస్తరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై పెద్దఎత్తున ఉద్యమించాలని జిల్లా సమితికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్ జీ, కిరణ్, శశి, జ్ఞానదీప్, సాయి, గోపాల్, అమరనాథ్, వెంకటేష్, చందు, అభి తదితరులు పాల్గొన్నారు.

175 సీట్లలో పోటీ చేయగలవా?

- అభ్యర్థులకే దిక్కులేదు... మమ్మల్ని ఓడిస్తావా
- మాజీమంత్రి పేర్ని నాని సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు 175 సీట్లలో పోటీ చేసే సత్తా ఉందా అని వైసీపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి పేర్ని నాని సూటిగా ప్రశ్నించారు. టీడీపీకి అభ్యర్థులే కరవయ్యారని ఎద్దేవా చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ ఒకటో తేదీన చంద్రబాబు అసత్యాలు, దూషణలతో అలౌకికానందం పొందారని నాని విమర్శించారు. 175 సీట్లలో వైసీపీని ఓడిస్తానని చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారని, అసలు 175 నియోజకవర్గాల్లో సైకిల్ గుర్తు ఉంటుందా అని నిలదీశారు. మూడ్నెళ్ల క్రితం టీడీపీ వాళ్లందరినీ కూర్చోబెట్టుకుని సుమారు 38 నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు లేరని వాపోయిన స్థితి చంద్రబాబుది కాదా అని హేళన చేశారు. ముందు ఆ 38 నియోజకవర్గాలకు అభ్యర్థుల్ని వెతుక్కోవాలని చంద్రబాబుకు సూచించారు. బీజేపీలో ఉంటూ పసుపు జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి, సుజనాచౌదరి వంటి వారికి ఎన్ని సీట్లు ఇస్తున్నావని ప్రశ్నించారు. 175 సీట్లలో పోటీ చేసే దమ్ము లేదని, పోటీ చేసే స్తోమతా లేదని, పది మందిని కలుపుకుంటే కానీ పోటీ చేసే సాహసం చేయలేని దుస్థితి చంద్రబాబుదని విమర్శించారు. మొత్తం 21 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే చంద్రబాబు గెలిచింది కేవలం నాలుగు అని, పట్టభద్రుల్లో మూడు, ఎమ్మెల్యేకోటాలో ఒకటని గుర్తుచేశారు. 21 స్థానాల్లో కేవలం నాలుగు గెలిచి చంకలు గుద్దుకోవడం ఏమిటో? దానికే ప్రపంచాన్ని జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు చంద్రబాబు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు.

గత ఎన్నికల్లో విడుదల చేసిన మేనిఫెస్టోలో చెప్పిన మాటలు ఏమయ్యా యని బీజేపీని నానీ ప్రశ్నించారు. కర్నూలు డిక్లరేషన్‌లో బీజేపీ కోరిందేమిటి? ఈరోజు ఆ పార్టీ చేస్తున్నదేమిటి? అని ధ్వజమెత్తారు. బీజేపీ కర్నూలు డిక్లరేషన్‌లో ఉన్నట్లు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామనే కదా సీఎం జగన్ చెప్పారని, మరోవైపు పవన్‌కల్యాణ్ కూడా గత ఎన్నికల ముందు ఏమన్నాడు? తన మనసుకైతే తమ ప్రభుత్వం వస్తే కర్నూలే రాజధాని అని ఆ నగర పర్యటనలో అన్నాడు గదా...విశాఖ వెళ్లి ఈ ప్రాంతం రాజధాని కావడానికి అన్ని అర్హతలు ఉన్న నగరమని చెప్పలేదా అని నాని నిలదీశారు. చంద్రబాబు తలకిందులుగా తపస్సు చేసినా, ఎన్ని పార్టీలను మూటగట్టుకుని వచ్చినా జగన్‌కు ప్రజల గుండెల్లో ఉన్న స్థానాన్ని కదపలేరని, 2024లోనూ మళ్లీ జగన్ ప్రభుత్వం రాబోతుందని స్పష్టంచేశారు. అమరావతి ప్రాంతంలో 54 వేల మంది నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం చేస్తోందన్నారు. బీజేపీ ముసుగులో టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి అక్కడి దళితులపై చేసిన దాడిని ఖండించారు. చంద్రబాబు పంచన ఉన్నప్పుడు ఆదినారాయణరెడ్డి దళితులను ఎలా అవమానించాడో అందరికీ గుర్తుందన్నారు. అప్పులన్నీ చేసిన చంద్రబాబు ఇప్పుడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, తెలంగాణలో తలసరి ఆదాయం బాగా పెరిగిందని, ఇక్కడ అసలు పెరగలేదని ఆయన అనడాన్ని తప్పుపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ప్రతి పైసాకూ లెక్క ఉందని, చంద్రబాబు చేసిన అప్పుకు లెక్కేదని ప్రశ్నించారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందే

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు : కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్ హామీ ఇవ్వడాన్ని గుర్తుచేస్తూ దానిని నిలబెట్టుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మప్ప, మాజీ అధ్యక్షుడు జోసఫ్ సుధీర్ బాబు సూచించారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గుంటూరు ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిమ్మన్న, సుధీర్ బాబు మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను విభజించి పాలిస్తూ పబ్బం గడుపుకుంటోందని, ఇది ఎంతో కాలం కొనసాగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఒకే వేదిక మీదకు తెచ్చి ఉద్యమాన్ని నిర్మించడానికి ఎస్టీయూ వెనుకాడబోదని తేల్చిచెప్పారు. 11వ పీఆర్సీ ఆర్థిక బకాయిలు దాదాపు రూ.3వేల కోట్లు తక్షణం చెల్లించాలని, పెండింగ్ ఉన్న నాలుగు విడతల కరువుభత్యాన్ని విడుదల చేయాలని నేతలు డిమాండ్ చేశారు. కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యాయులకు కనీస వేతనం చట్టం అమలు చేసి 30 శాతం జీతాలు పెంచాలని, సీనియారిటీ ఆధారంగా వారిని క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని, అన్ని రకాల కోర్టు కేసులను ప్రభుత్వమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ప్రకటించి ఇతర ఉద్యోగులతో సమానంగా 30 రోజుల సంపాదిత సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు ఉపాధ్యాయవాణి కన్వీనర్ షేక్ బాజీ, జిల్లా ఉపాధ్యక్షులు పేరేచర్ల శ్రీనివాసరావు, జి.జోజప్ప, డీఏ జోసఫ్, ఎంపీ సుబ్బారావు, కేవీ రమణ, సలార్ బేగ్, ఎం.శ్రీనివాసరావు, కిషోర్ పాల్గొన్నారు.

అమరావతిని రాజధానిగా కొనసాగించాలి

- రైతుల త్యాగాలను విస్మరిస్తున్న వైసీపీ ప్రభుత్వం
- ఎంతటి పోరాటాలకైనా సిద్ధం
- అరసవల్లి దేవస్థానానికి రైతుల మహా పాదయాత్ర రథం

విశాలాంధ్ర -శ్రీకాకుళం: రాష్ట్ర అభివృద్ధి కోసం తమ విలువైన భూములను ఇచ్చిన అమరావతి రైతుల త్యాగాలను వైసీపీ ప్రభుత్వం విస్మరించడం దారుణమని, రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని ప్రకటించే వరకు ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడతామని అమరావతి రైతుల జేఏసీ నాయకులు కాటా అప్పారావు, రాయపాటి శైలజ, ఎం.పావని, జేఏసీ సమన్వయ కమిటీ నాయకులు కె. సతీష్ చంద్ర స్పష్టం చేశారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని నినాదంతో అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, ఆ ప్రాంత రైతులు అమరావతి నుంచి అరసవల్లి దేవస్థానం వరకు చేపట్టిన మహా పాదయాత్ర కొన్ని కారణాలతో కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో నిలిచిపోయింది. అయితే యాత్రను ముగించేందుకు యాత్రను ముగించేందుకు శనివారం యాత్రలో రైతుల వెంట వచ్చిన రథాన్ని అరసవల్లికి తీసుకువచ్చారు. సుమారు 300 మంది అమరావతి రైతులు బస్సుల్లో అరసవల్లికి చేరుకొని ఆదివారం ఉదయం సూర్యభగవానుడిని దర్శించుకున్నారు. ఈ యాత్రకు సీపీఐ నాయకులు సనపల నర్సింహులు, టీడీపీ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు, గొండు శంకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత రాజధాని నిర్మాణం కోసం మూడు పంటలు పండే విలువైన భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం అమరావతి రైతులు త్యాగం చేశారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 30 వేల ఎకరాలు కాదని, అంతకంటే ఎక్కువగానే రాజధానికి కావాలని చెప్పి అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాజకీయ లబ్ధి కోసం మూడు రాజధానులను తెరపైకి తీసుకువచ్చి అమరావతి రైతుల త్యాగాలను విలువ లేకుండా చేస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ చూసినా రాష్ట్రానికి ఒకే రాజధాని ఉంటుందని, వైసీపీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు చేస్తామంటూ అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా రాష్ట్రానికి రాజధాని లేకుండా రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందితే ఆ ప్రాంతంలో ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తా యని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దానికి నిదర్శనమే విశాఖను రాజధాని చేస్తామని చెప్పినప్పటికీ ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీని ఆదరించలేదని తెలిపారు. రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వం రాజకీయాలు విడనాడి అమరావతినే రాజధానిగా కొనసాగించాలని, లేకుంటే పట్ట భద్రులు ఎటువంటి నిర్ణయం తీసుకున్నారో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రజలు అలాంటి నిర్ణయమే తీసుకుంటారని హెచ్చరించారు. రాజధానిపై సుప్రీం కోర్టు తీర్పు మేరకు తమ కార్యాచరణ రూపొందిస్తామని, ఈ లోగా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నా దానిపై పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి రైతులు కొమ్మినేని వరలక్ష్మి, ఆరోర మంగమ్మ, కె.అప్పారావు, సునీత, గోవిందమ్మ తదితర రైతులు ఉన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న రైతులు

విశాలాంధ్ర-గోపాలపట్నం : అమరావతి కోసం మహా పాదయాత్ర చేపట్టిన రైతుల బృందం ఆదివారం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి తొలి పావంచా వద్ద సింహాద్రి నాధుని దర్శించుకుంది. ఈ పాదయాత్రకు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి సంపూర్ణ మద్దతు లభించిందని రైతులు తెలిపారు.

సాహితి

రచనలే జీవితంగా భావించే రస్కిన్ బాండ్

రస్కిన్ బాండ్. ఈ పేరు వినని సాహితీప్రియులు ఉండరు. ఆయన స్వతహాగా ఆంగ్లంలో రాసినప్పటికీ ఇంచుమించు అన్ని భారతీయ భాషల్లోకి వారి రచనలు అనువాదాలు జరిగాయి, జరుగుతూనే ఉంటాయి. ఇంగ్లీష్ పాఠ్యగ్రంథంలో ఎక్కడో ఓ చోట బాండ్ ఒక్క కథనో, వ్యాసమో చదివే ఉంటాము. ఇక సి.బి.ఎస్.సి., ఐ.సి.ఎస్.ఇ. సిలబస్‌లు చదివి వచ్చిన యువత గురించి చెప్పాల్సిన పని లేదు. ఆయన రాసిన అనేక కథల పుస్తకాల్ని చదువుకుంటూ పోతూనే ఉంటారు. జీవితంలో ఒక భాగమై ఆయన పేరు మీద అనేక గ్రూపులు ఆన్‌లైన్‌లో నడుపుతుంటారు. ఈ మేగజైన్ కూడ ఉంది. కథని ప్రేమించే మనిషికి ఆయన కథ తగిలితే చాలు ఇక అక్కడితో ఆగలేరు.

మరి ఇంతాచేసి ఈ రస్కిన్‌బాండ్ ఎవరు..? చిన్నపిల్లలు, యువతరం, పెద్దతరం అందరినీ తనదైన ప్రత్యేక కథన కుతూహలంతో అలరించే ఈయన ముస్సోరి అనే పట్టణంలో, హిమాలయ సానువుల్లో, ఆ కొండల్లో ఎన్నో దశాబ్దాల నుంచి జీవిస్తూ అక్కడి తన అనుభవాలనే గాక ఇంకా తన జీవితంలోని ఎన్నో అనుభవాలను కథల రూపంలో రాస్తూ ఇప్పటికీ 100 పుస్తకాల కి పైగా వెలువరించాడు. ప్రస్తుతం ఎనభైవ పడిలో ఉన్నాడు. జన్మతః ఆంగ్లేయ దంపతులకి పుట్టినప్పటికి భారతదేశాన్ని తన ఆవాసంగా చేసుకుని ఇక్కడే ఉండిపోయాడు. తన అసలు పేరు ఓవెన్ రస్కిన్ బాండ్, 1934లో హిమాచల్‌ప్రదేశ్‌లోని కాసులి అనే ఊరిలో జన్మించాడు.

ఆయన చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోయారు. తల్లి అప్పటి ఒక భారతీయ సంస్థానాధీశుణ్ణి రెండో వివాహం చేసుకోవడంతో, ఎక్కువగా తండ్రి వద్దనే పెరిగాడు. బ్రిటీష్ ఆర్మీలో పనిచేసే అతను అనేక ప్రాంతాలు తిరిగేవాడు. బాండ్ కూడా తండ్రితో పాటూ తిరిగాడు. యవ్వనదశకి ముందే తండ్రిని కోల్పోయాడు. ఆ తర్వాత తనది ఒకరకమైన అనాధ జీవితమే అయింది. స్నేహితుల సాయంతోనూ, చిన్న చిన్న పనులతోనూ తనని తాను పోషించుకున్నాడు. ఇండియాకి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తన బంధువులు, తెలిసినవాళ్ళు చాలామంది ఇంగ్లండ్‌కి వెళ్ళిపోయారు. అయితే తాను మటుకు ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాడు.

రచయితగా మాత్రమే జీవించాలని కంకణం కట్టుకున్నా, అది ఇండియాలో చాలా కష్టమని తెలిసింది. ట్యూషన్స్ చెప్పినా, స్వచ్ఛంద సంస్థలో పనిచేసినా దానికోసమే. మొత్తానికి రమారమి 70 ఏళ్ళపాటు రచనారంగంలో ఉండి 100 కథల పుస్తకాల్ని ఇప్పటిదాకా రాశాడు. లెక్కలేనన్ని వ్యాసాలు, ఇతర ప్రక్రియలు చేపట్టాడు. మరి ఇన్నేళ్ళ తన జీవితంలో తాను పొందిన తీపి, చేదు అనుభవాలు అన్నిటినీ కలిపి రస్కిన్ బాండ్ తన ఆత్మకథని రాసుకున్నాడు దాని పేరు Lone Fox Dancing ,రెండువందల ఎనభై పేజీలు. స్పీకింగ్ టైగర్స్ వాళ్ళు ప్రచురించారు. ప్రతి ఒక్క రచయిత లేదా రచయిత కాదలుచుకున్న వ్యక్తి తప్పక చదవాలి.

ఈ ఆటోబయోగ్రఫీ చదవడం వల్ల మనకి రస్కిన్ బాండ్ యొక్క జీవితగాథ తెలియడమే కాదు. దానితో బాటు అనేక విషయాలు తెలుస్తాయి. నాటి బ్రిటిష్ ప్రభుత్వంలో పనిచేయడానికి వచ్చిన అనేకరకాల మనుషుల మంచీ చెడు తెలుస్తాయి. వాళ్ళ వ్యామోహాలు, ఉద్యోగధర్మంగా వాళ్ళు చేసిన పనులు, వాటి పర్యవసానాలు తెలుస్తాయి. అంతేకాకుండా స్థానిక ప్రజలతో వాళ్ళ అనుబంధాలు తెలుస్తాయి. ముఖ్యంగా సింలా, డెహ్రాడూన్, జాంనగర్, లక్నో వంటి ప్రాంతాల్లో నాటి నేటివ్ బ్రిటిషర్స్ ఎలా జీవించేవారు, రోజువారి జీవితంలోని పదనిసలు ఇప్పుడు చదువుతుంటే ఆసక్తిగా అనిపిస్తాయి.



స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలామంది బ్రిటిషర్లు ఇక్కడ ఉండడంలో ఇన్సెక్యూరిటీ ఫీలయ్యి ఇంగ్లండ్‌కి వెళ్ళిపోయారని రస్కిన్ బాండ్ చెబుతాడు. తాను నాలుగుఏళ్ళు లండన్ వెళ్ళి కొన్ని ఉద్యోగాలు ప్రయత్నించి తనకి ఇండియానే బాగుందనిపించి మళ్ళీ వెనక్కి వస్తాడు. దానికి కారణం చెబుతూ హిమాలయ సానువుల్లోని ఆ గుట్టల్లోనూ, చెట్లలోనూ, ఉండి ఉండి అవి నాలో ఓ భాగమయిపోయాయి. ఆ తర్వాత ఢిల్లీలోనూ, బొంబాయిలోనూ ఉండాల్సి వచ్చినా అది తనవల్లగాదని ముస్సోరిలోనే స్థిరపడ్డాడు. అక్కడ నుంచే తన రచనాయాత్రని సాగించాడు. అప్పటికి ఆ ఊరు చాలా చిన్నది. తన మొట్టమొదటి నవల The Room on the Roof ఇలస్ట్రేటడ్ వీక్లీ ఆఫ్ ఇండియాలో సీరియలైజ్ అయినప్పుడు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతాడు. దాన్ని ఎవరికైనా చూపించి శభాష్ అనిపించుకోవాలన్నా దాన్ని అర్థం చేసుకునే వాళ్ళు ఆ చుట్టూతా ఎవరూ ఉండరు.

ఢిల్లీలో ఉన్న కుష్వంత్ సింగ్ తనని ఇంటికి పిలిచి పార్టీ ఇస్తాడు ఒకసారి, తన రచనల్ని బాగా ప్రోత్సహించేవాడని రస్కిన్ బాండ్ రాసుకున్నాడు. మెల్లిగా స్వదేశీ, విదేశీ ఇంగ్లీష్ పత్రికల్లో రాయడం మొదలుపెట్టి తనకంటూ ఓ స్థాయిని సంపాదించుకుంటాడు. ఆ తర్వాత ఇంప్రింట్ అనే పత్రికకి సహ సంపాదకునిగా ఆర్.వి.పండిట్ కోరిక మీద పనిచేశాడు. ఎమర్జెన్సీ టైంలో ఆ పండిట్ మీద అప్పటి ప్రభుత్వానికి ఉన్న కోపంవల్ల ఓ చిన్న కేసులో ఇరు క్కుంటాడు. అయితే ఈజీగానే దానిలోనుంచి బయట బడి తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగించాడు.

ఇప్పుడు మాదిరిగా అప్పట్లో రచయితలకి పబ్లిసిటీ లేదని, తాను ఓసారి బిబిసిలో ప్రోగ్రాం ఇవ్వడానికి వెళ్ళినప్పుడు గ్రాహం గ్రీన్ తన పక్కనే కూర్చున్నా తాను గుర్తించలేదని, ఆ తర్వాత ఎవరో తనకి చెప్పడంతో ఖంగుతిన్నానని అంటాడు. అయితే ఎర్నెస్ట్ హెమింగ్వే లాంటి వాళ్ళు వేరు. పబ్లిసిటీ కోసం ఏవో చేస్తుండేవారని అంటాడు. ఇలా ఎన్నో విషయాల్ని తనకి తారసపడిన సంఘటనల్ని అక్షరబద్ధం చేశాడు. 50 ఫోటోలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అవి అన్నీ ఎన్నో నాటి సంగతులని వివరిస్తాయి. ముస్సోరిలో ఉండే రస్కిన్ బాండ్‌ని కలవడానికి ఎంతోమంది అభిమానులు వస్తుంటారు.

అక్కడ ఉండే కేంబ్రిడ్జ్ బుక్ హౌస్ అనే పుస్తకాల షాప్‌లో వాళ్ళందర్నీ ప్రతి శుక్రవారం కలుస్తుంటాడు. ఇంట్లో మాత్రం ఎవరినీ కలవడాయన. దానికీ కొన్ని కారణాలు ఉన్నాయి. బెంగాల్ నుంచి ఓ రచయిత్రి చాన్నాళ్ళ క్రితం ఈయన ఇంటికి వచ్చి తప్పనిసరిగా తన పుస్తకానికి ముందుమాట రాయవలసిందే అని కూర్చుందట. నేను కొద్దిగా పనిలో ఉన్నా, స్క్రిప్ట్ ఇచ్చి వెళ్ళమంటే నానాయాగీ చేసిందట. సరే...ఎవరి అనుభవాలు వాళ్ళవి. మన ఆర్.కె.నారాయణ్ గారు జీవించి ఉన్న రోజుల్లో అభిమానుల్ని ఇంట్లో కాకుండా బయటనే ఎక్కువ కలిసేవారని చదివాను. ఆయనకి లభించిన అవార్డులు ఎన్నో, సాహిత్య అకాడెమీ అవార్డ్‌తో పాటు...భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ లాంటి పురస్కారాలు ఇచ్చి సత్కరించింది. రస్కిన్ బాండ్ అనే పేరు దేశ విదేశాల్లో విన్నుత్నమైన కథకి మరో రూపంగా అవతరించింది. అనేక అనుభవాల సమాహారంగా ఉన్న ఈ ఆటోబయోగ్రఫీ ప్రస్తుతం అమెజాన్‌లో లభ్యమవుతోంది.

- మూర్తి కెవివిఎస్, 78935 41003,

రాశిలో 'వారణాసి' కథలు- నీతిసుధలు

గ్రంథ సమీక్ష



పెద్దకొడుకు-వారణాసి భానుమూర్తిరావు, పేజీలు: 175, వెల: రూ. 250/-, ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాల్లోను దొరుకుతాయి. వారణాసి భానుమూర్తిరావు-9989073105

వర్తమానంలో తెలుగు కథకులు ఎంచుకుంటున్న విషయ పరిణతి- పరిమితి వైవిధ్యతల్ని కనపరుస్తోంది. అసలు కథకుని ప్రయాణంలోంచి సమాజం స్వీయాను భవాలు సహజాతంగా వేలుపట్టి నడిపిస్తున్న అనుభూతి పాఠక ప్రతిక్రియకు దోహదపడ్తుంది. నవలా కారుడు, కవి, కథకుడు అయిన వారణాసి- రాశిలో వాసి గల రచనలుగా అనేక పత్రికల్లో బహుమతులు, అంతర్జాలం, ఆధునిక గ్రూప్స్‌లోకి విస్తరించటం జరిగింది. వృత్తిరీత్యా వివిధ హోదాలలో అనేక ప్రముఖ కంపెనీలలో పనిచేసిన భానుమూర్తి సమాజగతంగా తన ప్రవృత్తిని పదిలపర్చుకునే ప్రయత్నంలో భాగంగా 3 కవితా సంపుటులు సాగర మథనం (2000) సముద్రఘోష (2005) మట్టివేదం (2022) లో ప్రచురించారు.

బహుముఖ ప్రశంసలందుకున్న నవలారాజు, సంస్కార సమేత రెడ్డినాయుడు అని ప్రశంసలందు కున్నారు. ఇటీవల వెలువరించిన "పెద్దకొడుకు" కథాసంపుటిలో పథకోణాలన్నీ మాండలికం సరళ గంభీరంతో బాటు సాధారణ నగర జీవన శైలి సంభాషణలు కూడా చోటు చేసుకోవడంలోని నైపుణ్యం విశదమవు తుంది. స్థూలంగా భానుమూర్తి కథలన్నీ పాత్రల స్వభావం, మనస్తత్వం సహానుభూతుల్ని పంచేవిగా ఉండటం గమనిస్తాము.

కర్మానుసారే కథలోని సందేశంతో మట్టి అనుబంధం, అమ్మ ప్రేమ, ఆత్మస్థైర్యం మనోబలంతో సాధించగలిగిన విజయాలు చౌడమ్మ, ఎంకట్రావుల నుంచి రచయిత సందేశం ప్రారబ్ద కర్మ నుంచి ప్రేరణ మానసిక ధైర్యం మంచి పనులకి రూపమయ్యింది. వస్తుతః కథలన్నీ తరాల అంతరాల్ని మారుతున్న సమాజ గతవేదనల్ని, ఆర్ధతల్ని వ్యక్తిత్వపు విలువల్ని చాటిన తత్వం, కథనం విశేషంగా కన్పించడం గమనించవచ్చును. "వృద్ధుడి చరమాంకం" కథలోని ధైన్యం కలచివేసిన ముగింపు, తల్లితండ్రుల ఆర్థిక పరిస్థితుల్ని అర్థం చేసుకోలేని మనో వైచిత్రిని- ధన- జన సంబంధాల సామ్యంతో, భార్యను కోల్పోయిన వృద్ధునికి మానసిక చేయూతనిచ్చిన రాజమ్మలు యింకా కొంతమందైనా మానవీయతను నిల్పారు. ఉత్తమ శిష్యుడు కథనంలో గురుభక్తిని సార్వజనీనం చేసిన సంభాషణలు నీతికథని తలపించాయి.

అతను- ఆమె కథలోని వ్యామోహపరత్వం స్నేహం ముసుగులోని ద్రోహ చింతన ద్వారా మధులాంటి వాళ్లు నేడు కోకొల్లలుగా కన్పిస్తారు. కోమలి- రాజారావుల పాత్రల సౌమనస్యం విలువల్నిచ్చింది. రంగుల ప్రపంచం కథని సమాజ వర్గంలోని సంపన్న దంపతుల్లో భార్య మనస్తత్వాన్ని మార్చే మానవీయ సంఘటన రూపకల్పన సన్నివేశబలం బర్త్‌డే పార్టీకి ఐదులక్షలు ఖర్చుపెట్టే ధనవంతులున్న దేశంలో పుట్టిన పిల్లలకు పాలు కూడ పట్టలేని ఆగర్భదరిద్రులు గురించిన సాపేక్ష సానుభూతి కలచివేస్తుంది. తిరిగే దేముళ్లు కథలో స్నేహం, దేముడు మనుషుల్లోంచి కృతజ్ఞతాభావాలు తెల్పారు. "రెడ్డమ్మ" కథనంలో అంతర్లీనంగా కష్టం విలువ కఠోర సాధన దరిమిలా పొందిన విజయాల్ని చెప్పారు. మొత్తం 19 కథలు జీవన వాస్తవికతలు నేల విడిచి సాము చెయ్యలేదు. రచయితకు మరింత పేరుతెస్తాయి.

-వి.యస్.ఆర్.ఎస్.సోమయాజులు, సెల్: 9441148158

ఓర్మికి చిరునామా

చినుకు రాలకున్నా, చింత పెరుగుతా ఉన్నా
నింగి అంచుల్లో చూపు నిలిపి
ఆశను, గుండె నిండా పరుచుకుంటాడు
చినుకు రాలి, చింత తీరగానే
హలాన్ని భుజాన వేసుకుని
పచ్చని పల్లెతనంలో కరిగి,
పంట భూమిగా విస్తరిస్తాడు
అపశ్రుతుల కలుపును పీకేసి, ఆశయాల విత్తులు నాటి
వరి కంకియై మొలకెత్తుతాడు
భవిత ఊహల్లో ఊరిన వేదనా భారాన్ని
గుండె కింద అణిచిపెట్టి
చిరునవ్వును, పెదాల మీద చిలకరిస్తాడు
పురుగులు పంటమీద కెగబాకి
ఆత్మవిశ్వాసాన్ని కొరికేస్తా ఉన్నా
ఎరువులు ఎదురు తిరిగి
ఎగతాళి చేస్తా ఉన్నా
సహనాన్ని, తెల్లని
పంచెకట్టులో నిలుపుతాడు
చేసిన అప్పులు, వడ్డీలలో నాని
హృదయాన్ని పిండేస్తా ఉన్నా
చెదరని హుందాతనాన్ని
తలకి పాగాగా చుడతాడు
పంట పరువాని కొచ్చిన వేళ
పొలం గట్టు మీద నులక మంచమై
కళ్లల్లో దివిటీలు వెలిగించుకుంటాడు
అనుభవంలోంచి జనించిన
కష్ట నష్టాలన్నింటినీ శ్రమ స్వేదంతో కడిగేసి
ఓర్పుకి తనే చిరునామాగా
జాతి నోట అన్నం మెతుకవుతాడు
పండుగలు సంబరాలైనప్పుడు
పల్లె గుమ్మానికి పచ్చ తోరణమై పరవశిస్తాడు
గుడిలో గంటై మోగి
జనసీమను మేల్కొల్పుతాడు
ముంగిట్లో రంగవల్లై
అందరినీ పలకరిస్తాడు
మదిలో తిష్ట వేసిన భారాన్ని కాస్త దులిపేసి
సంతృప్తిని కళ్లల్లో నిలుపుతాడు
వాడు, జన జీవనాడి ఎరిగిన రైతన్న!

-ఎస్.ఆర్.పృథ్వి, సెల్: 9989223245

మంచి పుస్తకం

మియా కవిత్వం

తెలుగువాడే అయినా తెలుగునేలలో పుట్టలేదు. ఖరగ్ పూర్ లో పుట్టారు. బెంగాల్‌లో ఉన్నందువల్ల బెంగాలీ మీద పట్టు సంపాదించారు. తాను ఆస్వాదించిన దాన్ని ఇతరులూ ఆస్వాదించాలనుకుంటారు. చాలామంది రచయితలు తమ రచనలను అమితంగా ప్రేమిస్తారు. ఇలా సంతృప్తి పడడంవల్ల అలాంటి వారికి సాహిత్య రంగంలోని భిన్న పార్శ్వాలు, రీతులు, సంప్రదాయాలు, మార్పులు తెలియకపోవచ్చు. తెలుసుకోవాలనీ అనుకోరు. కొత్త దారులు పడ్డా పట్టించుకోరు. ముకుంద రామారావు ఈ ధోరణికి పూర్తిగా విరుద్ధం.

తాను తిరిగిన చోట్లు, పెరిగిన చోట్లు ఎలా ఉన్నాయో పరిశీలిస్తారు. చిన్ననాటే సాహిత్య గంధం అబ్బినందువల్ల వివిధ ప్రక్రియల్లో ఆయన గణనీయమైన కృషే చేశారు. అనేక దేశాల కవిత్వాన్ని అనువదించారు (అదే ఆకాశం). ప్రపంచదేశాల కవిత్వ నేపథ్యం (అదే గాలి) తెలుగువారికి పరిచయం చేశారు. భారతీయకవిత్వ నేపథ్యాన్ని (అదేనేల) ఒడిసి పట్టుకున్నారు. మధ్యయుగాల భక్తి కవిత్వ నేపథ్యం ఏమిటో తరచి చూశారు. శతాబ్దాల సూఫీ కవిత్వ ఆనవాళ్లు వెతికిపట్టారు. నోబుల్ బహుమతులు అందుకున్న వారిని, వారి జీవిత విశేషాలను పరిచయం చేశారు. తనకు నచ్చిన జాతీయ అంతర్జాతీయ కవిత్వ విశేషాలను ఎత్తి చూపారు.

గత సంవత్సరం మరో కవిత్వ ధోరణిని తెలుగు వాకిట్లోకి తీసుకొచ్చారు. అదే మీయా కవిత్వం. "మియా కవిత్వం" అని కొన్ని కవితలను అనువదించి 2022 నవంబర్‌లో ప్రచురించారు. ఆ కవిత్వ ధోరణి ఆయనకు తారసపడింది అంతకు రెండేళ్ల ముందే. ఆ తీగ పట్టుకుని డొంక లాగడం మొదలు పెట్టినప్పుడు బాగా నచ్చిన మియా కవితలను తెలుగు వారి దృష్టికి తీసుకురావాలనుకున్నారు. అదే "మియా కవిత్వం" సంపుటి.

ఈ గ్రంథంలో మియా కవిత్వ నేపథ్యాన్ని వివరంగా అందించారు. తాను సుదీర్ఘ ముందుమాట రాయడంతో పాటు, ప్రసిద్ధ కవి అశోక్ వాజపేయి తో చిన్న పీఠిక రాయించారు.

2019లో మియా కవిత్వ ధార గురించి నేను తెలుసుకున్నప్పుడు ఒక దినపత్రికలో "విద్వేష పంకంలోంచి మియా కెందామర" వ్యాసం రాశాను. ఈ వ్యాసం రాయడానికి ముందు సాహితీ మిత్రులను ఈ ధోరణి గురించి ఏమైనా తెలుసునా అని అడిగితే ఒక్కరు కూడా తెలుసు అనలేదు. కానీ 2022 లో ముకుంద రామారావు ఏకంగా మియా కవిత్వాన్ని అనువదించి అదే పేరుతో ప్రచురించారు. అంటావి వివిధ చోట్ల జరుగుతున్న పరిణామాలను పరిశీలించే లక్షణం ఆయనకు ఉందనేగా.

మియా కవితల్లో కొన్నింటిని అనువాదం చేసి ఊరుకున్నారు తప్ప ఒక సంపుటిగా ప్రచురించాలనే ధ్యాసే ఆయనకు రాయలేదు. మొత్తం మీద కొద్ది రోజులకు మియా కవిత్వం పుస్తకం వెలువడింది.

అసలీ మియా కవిత్వం అంటే ఏమిటి? మియా అన్న మాటకు ఉర్దూలో చాలా అర్థాలు ఉన్నాయి. అత్యంత గౌరవభావంతో ఈ మాట వాడతారు. ఆ సంస్కారం గురించి పట్టించుకోని మన ప్రధానమంత్రి మోదీ లాంటి వారికి నిందార్థం మాత్రమే స్ఫురిస్తుంది. నవాజ్ షరీఫ్ పాక్ ప్రధానిగా ఉన్నప్పుడు మోదీ ఆయనను ఎప్పుడూ 'మియా ముషరఫ్' అని నిందార్థంలోనే ప్రస్తావించే వారు.

దాదాపు 75 లక్షల జనాభా ఉన్న మియాలు ప్రధానంగా అస్సాంలో కనిపిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అస్సాంలో స్థిరపడిన వారు ఎక్కువ



మంది. అలాంటి వారిలో మియాలు అధిక సంఖ్యాకులు. అస్సాంలో వ్యవసాయం అభివృద్ధి చేయడం కోసం బ్రిటిష్ వారు ప్రధానంగా బెంగాల్ నుంచి ముస్లింలను తీసుకొచ్చారు. ఆ తరవాత బంగ్లాదేశ్ నుంచి వచ్చి అస్సాంలో స్థిరపడ్డ వారూ ఉన్నారు. స్థూలంగా పరాయి దేశమ్నుంచి వచ్చి అస్సాంలో స్థిరపడిన వారిని మియాలు అంటున్నారు. ఈ సమాజం నిరంతరం నిర్లక్ష్యానికి గురి అవుతూనే ఉంది. "ఈ సమాజంలోని ప్రజలను చంపినందుకు, హింసించినందుకు ఏ ప్రభుత్వం ఎవరినీ శిక్షించలేదు" అని ముకుంద రామారావు అంటారు. మియాలు అస్సామీలు కాకపోయినా ఒక్క సారి వచ్చి స్థిరపడిన తరవాత అస్సాం సంస్కృతిని, భాషను సొంతం చేసుకున్నారు. మియా కవుల్లో చాలా మంది రాసేదీ అస్సామీ భాషలోనే. అయినా చాలా మంది దృష్టిలో, ముఖ్యంగా ప్రభుత్వం దృష్టిలో పరాయి వారే.

అస్సామీ సమాజంతో తాము ఎంతగా కలిసిపోయినా వారు తమను తమ వారిగా అంగీకరించకపోవడంతో ఆవేదనకు గురై కవిత్వం రాసే అభిరుచి ఉన్న వారు అల్లిన కవిత్వాన్నే మియా కవిత్వం అంటున్నారు. మియాలు శరణార్థులు మాత్రమే అయితే పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉండేదేమో. కాని వారు ముస్లింలు కూడా అయినందువల్ల మియాలు అనేక రూపాల్లో వివక్షకు గురవుతున్నారు. అసలైన అస్సామీలు ఎవరో తేల్చే క్రమంలో వీరిలో అభద్రతాభావం విపరీతంగా పెరిగింది. డా. హఫీజ్ అహమద్ అనే మియా కవి బాధ చూడండి...

అర్హులైన జాతీయపౌరుల జాబితా(ఎన్.ఆర్.సి.)లో
నా సంఖ్య 2000543
నాకు ఇద్దరు పిల్లలు
వచ్చే వేసవిలో ఇంకొకరు చేరబోతున్నారు
నన్ను అసహ్యించుకున్నట్టే వాడినీ అసహ్యించుకుంటావా?

నేను మియానని రాసుకో
బీడు భూముల్ని
పచ్చటి పైరు పొలాలుగా మారుస్తాను
మీకు తిండి కోసం
ఇటుకలు మోస్తాను
మీ మేడలకోసం..."
..."మీ మురుగు శుభ్రం చేస్తాను
మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడానికి
మీ సేవకోసమే సదా ఉన్నాను
అయినా మీకు సంతృప్తి లేదు
రాసుకో మియానని"

రెజ్వాన్ హుస్సైన్ ఆవేదన ఇలా ఉంటుంది...

"మమ్మల్ని తిట్టండి
తన్నాలనుకుంటే తన్నండి
సహనంతో మీ భవనాలను, వంతెనలను
కడుతూనే ఉంటాం
మీ అలసి బలిసిన చెమట శరీరాల్ని
సైకిల్ రిక్షాలో సహనంతో లాగుతూనే ఉంటాం"

సొంతనేలను వదిలివచ్చి అస్సాంలో స్థిరపడ్డ మియాల బాధ ఈ సంపుటిలోని ప్రతి కవితలోనూ కనిపిస్తుంది. ముస్లింలు అయినందుకు వారి బాధ ఇతర శరణార్థుల బాధకన్నా అనేక రెట్లు ఎక్కువ. ఆ బాధనే ముకుంద రామారావు మనతో పంచుకున్నారు.

-ఆర్వీ రామారావ్

మీ ఇంటిని చక్కదిద్దుకోండి

- కాంగ్రెస్‌కు చురకలు
- కర్నాటకలో సామాజికాభివృద్ధి పేరుతో ఓట్లడుగుతాం
- రాహుల్‌పై అనర్హత దురదృష్టకరం
- మూడు... నాల్గవ ఫ్రంట్‌ను నమ్మను
- దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించే మొదటి ఫ్రంట్ మనమే
- జేడీఎస్ నేత హెచ్‌డీ దేవెగౌడ

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ తన ఇంటిని చక్కదిద్దుకోవాలని జనతాదళ్ (లౌకికవాద) వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ అన్నారు. విపక్షాల ఐక్యతపై సందడి నెలకొన్న నేపథ్యంలో ఆదివారం ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ముందు అనేక ఎంపికలు ఉన్నాయని, దేశానికి నాయకత్వ సంపద ఉందని తెలిపారు. మే 10న కర్నాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో జేడీ(ఎస్) అవకాశాల గురించి ఆశావహ వాతావరణం నడుమ, ఈ ఏడాది ఇతర రాష్ట్రాల ఎన్నికలకు, 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సన్నాహాలు చేస్తున్నట్లు వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా చురుకైన ప్రచారానికి దూరంగా ఉన్న ఈ ప్రముఖ నాయకుడు అన్నారు. రెండు జాతీయ పార్టీలు... అధికారంలో బీజేపీ, కాంగ్రెస్ కీలక ప్రమేయం ఉన్న కఠినమైన ఎన్నికల పోరు మధ్య, గౌడ తన జేడీ(ఎస్) అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. 'సమ్మిళిత సామాజిక, అభివృద్ధి దృష్టి, పంచరత్న కార్యక్రమం' పేరుతో ఓట్లు కోరుతున్నట్లు చెప్పారు. పార్టీ పాత మైసూరు ప్రాంతానికే పరిమితమైందనేది జాతీయ పార్టీల తెలివైన ప్రచారం అని ఆయన ధ్వజమెత్తారు. జాతీయ పార్టీలు 'తప్పుడు వాదనలతో' ముందుకు వస్తాయని తన రాతపూర్వక సమాధానాలలో ఆయన పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(ఎస్) అవకాశాలు, పార్టీ వ్యూహం, ప్రచారంపై దృష్టి గురించి అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, 'కర్నాటక అంతటా నా పార్టీ మంచి విజయం సాధిస్తుంది. కేవలం రెండు జాతీయ పార్టీలపైనే చాలా మంది దృష్టి పెట్టి విరక్తి చెందడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విభజన అజెండా కోసం మేం ఓట్లు అడగడం లేదు. సమ్మిళిత సామాజిక, అభివృద్ధి దార్శనికత, పంచరత్న కార్యక్రమం పేరుతో ఓట్లు అడుగుతున్నాం. మా పార్టీ అధికారంలోకి వస్తుంది. మేము ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తాం. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేసేందుకు మా నాయకుడు హెచ్‌డి కుమారస్వామి రాష్ట్రవ్యాప్త పర్యటనను పూర్తి చేశారు. ఆయనకు మంచి స్పందన లభిస్తోంది. మా పార్టీ వ్యూహం చాలా సులభమైనది... కష్టపడి పని చేయడం, ప్రజలతో చిత్తశుద్ధితో ఉండటం, వారిని ద్వేషించకపోవడం, విభజించకపోవడం' అని తెలిపారు. పాత మైసూరు దాటి జేడీ(ఎస్) తన పునాదిని గణనీయంగా విస్తరించుకోలేకపోయిందనే అభిప్రాయం కొన్ని వర్గాల్లో ఉందని, ఆ విషయంలో ఏం చేస్తున్నారన్న ప్రశ్నకు, 'ప్రాంతాలకే పరిమితమయ్యామని జాతీయ పార్టీలు చాకచక్యంగా చేస్తున్న ప్రచారం. మాకు ఎప్పుడూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. నేను ఏం చెబుతున్నానో అర్థం కావాలంటే ఎవరైనా 1999 నుంచి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల జాబితాను పరిశీలించాలి. అవును, మైసూర్ ప్రాంతం మాకు గరిష్ట మద్దతును అందించింది. అందుకు మేము కృతజ్ఞులం. ఈసారి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మరింత విజయవంతమవుతాం. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా అందరి కోసం పని చేశాను. ప్రాంతాల మధ్య వివక్ష చూపలేదు. స్వార్థపరులే అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. నా రాజకీయ జీవితంలో అబద్ధాలను ఎదుర్కోవడానికి నేను ఎప్పుడూ ఖరీదైన పీఆర్ ఏజెన్సీలను నియమించలేదు. 60 ఏళ్లుగా నన్ను పోషించిన ప్రజలకు నిజం తెలుసు' అని దేవెగౌడ పేర్కొన్నారు. స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు జేడీ(ఎస్) 123 స్థానాలు లక్ష్యంగా పెట్టుకుంది. ఇది అవాస్తవమని కొందరు విమర్శకులు అంటున్నారు. ఇది సాధించగలదనే విశ్వాసం మీకుందా? అని ప్రశ్నించగా, 'మన కృషి, అభివృద్ధి దృక్పథం మనకు విశ్వాసాన్ని ఇస్తున్నాయి. మా విమర్శకులు, రాజకీయ ప్రత్యర్థుల కుటిలత్వం గురించి నేను పట్టించుకోను' అని అన్నారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పై మీ అభిప్రాయం ఏమిటి, కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పుడు అవి అందించాయా అన్నదానికి... దీనిపై తాను వ్యాఖ్యానించదలచుకోలేదని, తమ పార్టీ నాయకులు హెచ్‌డి కుమారస్వామి, సి.ఎం.ఇబ్రహీం (జేడీ-ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు) దీనిపై సరైన విశ్లేషణ ఇవ్వగలరని చెప్పారు. జాతీయ పార్టీలకు పెద్దఎత్తున తప్పుడు వాదనలు చేయడం అలవాటు అని మాత్రమే చెప్పగలనని, వారి సర్కస్, అబద్ధాల ద్వారా ప్రజలు చూశారని ఆయన సమాధానమిచ్చారు. కర్నాటక ఎన్నికలు ఎంత ముఖ్యమైనవి. జాతీయ రాజకీయ రంగంపై దాని ఫలితాల అంతరార్థం ఏమిటని ప్రశ్నించగా, ఈ ఏడాది ఇతర రాష్ట్రాల ఎన్నికలకు, 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికలకు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు దిశానిర్దేశం చేస్తాయని, ఇది ఎప్పటినుంచో ఉందని, ఈసారి కూడా చేస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, పని తీరుపై మీ అభిప్రాయం, ఆయన పాలనలో భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి జరుగుతున్న చర్చపై అడగ్గా, 'వ్యవసాయ సమస్యలు, వ్యవసాయ చట్టాలు, కోవిడ్, కేంద్ర బడ్జెట్లు, ఆర్థిక వ్యవస్థ, ఈశాన్య భారతం, కశ్మీర్ మొదలైన అన్ని అంశాలపై నేను రాజ్యసభలో పాల్గొన్నాను. నేను వివరంగా మాట్లాడాను. ఇది పార్లమెంటులోనూ, నా సామాజిక మాధ్యమ ఖాతాలో రికార్డుగా ఉంది. ఎవరైనా వాటిని పరిశీలిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నా అంచనా ఏమిటో తెలిసిపోతుంది. నేను ఎప్పుడూ నా పనిని సీరియస్‌గా తీసుకుంటాను. 91 ఏళ్ల వయసులో అలానే కొనసాగిస్తున్నాను. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రతిపక్ష పార్టీ కాదు' అని స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విపక్షాల ఐక్యతను నెలకొల్పడంలో కాంగ్రెస్ పాత్ర విషయమై ప్రశ్నించగా, ముందుగా కాంగ్రెస్ తన ఇంటిని చక్కదిద్దుకోవాలని, ప్రతిపక్ష పార్టీల ముందు అనేక ఎంపికలు ఉన్నాయని, అలాగే ఈ దేశానికి నాయకత్వ సంపద ఉందని దేవెగౌడ చెప్పారు. రాహుల్ గాంధీపై ఎంపీగా అనర్హత వేటు వేయడంపై మాట్లాడుతూ తాను విడిగా వ్యాఖ్యానించదలచుకోలేదని, తమ పార్టీ సీనియర్ నేతలు ఇప్పటికే దీనిపై మాట్లాడారని, ఇది చాలా దురదృష్టకరమని చెప్పగలనని అన్నారు. జనతా పరివార్, మూడవ కూటమి పునరుద్ధరణకు అవకాశం ఉందని మీరు ఇప్పటికీ భావిస్తున్నారా లేదా అది ముగిసిన అధ్యాయమా అని ప్రశ్నించగా, 'ప్రతీదీ సాధ్యమే. నేను ప్రతిదీ అర్థం చేసుకున్నాను. మూడవ లేదా నాల్గవ కూటమిని నమ్మను, మనం ఏమి చేసినా, ఈ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించే మొదటి ఫ్రంట్ మనమే అవుతామని నేను నమ్ముతున్నాను' అని దేవెగౌడ స్పష్టం చేశారు.

అతిక్ అహ్మద్ సోదరుడి అరెస్టు

మీరట్: బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో కీలక సాక్షి ఉమేష్ పాల్ హత్యకేసులో నిందితులకు ఆశ్రయం కల్పించి డబ్బు సమకూర్చినందుకు మాజీ ఎంపీ అతిక్ అహ్మద్ బావమరిదిని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం(ఎస్‌టీఎఫ్) అరెస్టు చేసింది. గత రాత్రి ఇక్కడి నౌచండి ప్రాంతంలో ప్రభుత్వ వైద్యుడైన అఖ్లాక్ అహ్మద్‌ను అరెస్టు చేసి ప్రయాగ్‌రాజ్‌కు తరలించినట్లు ఎస్‌టీఎఫ్ పోలీసు సూపరింటెండెంట్ బ్రిజేష్ సింగ్ ఆదివారం తెలిపారు. ఉమేష్ పాల్, ఆయన పోలీసు సెక్యూరిటీ గార్డులు సందీప్, రాఘవేంద్ర సింగ్ లను ఫిబ్రవరి 24న ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్‌లోని అతని ఇంటి వెలుపల దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఉమేష్ పాల్ భార్య జయపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో అతిక్ అహ్మద్, అతని సోదరుడు అష్రఫ్, భార్య షైస్తా పర్వీన్, ఇద్దరు కుమారులు, సహాయకులు గుడ్డు ముస్లిం, గులామ్, మరో తొమ్మిది మందిపై కేసు నమోదైంది. అబ్దుల్లాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉమేష్ పాల్ హంతకులకు అఖ్లాక్ అహ్మద్ ఆశ్రయం కల్పించడమే కాకుండా, హత్యానంతరం మీరట్ చేరుకున్నప్పుడు డబ్బు కూడా అందించాడని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2006లో జరిగిన ఉమేష్ పాల్ కిడ్నాప్ కేసులో మార్చి 28న, ప్రయాగ్‌రాజ్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు అతిక్ అహ్మద్, మరో ఇద్దరిని దోషులుగా నిర్ధారిస్తూ వారికి జీవిత ఖైదు విధించింది. అష్రాఫ్‌తో పాటు మరో ఆరుగురిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

కర్నాటకలో గోరక్షకుల దాష్టీకం

రూ.2లక్షలు ఇవ్వలేదని ముస్లిం పశువ్యాపారిని కొట్టిచంపిన వైనం

బెంగళూరు: కర్నాటకలో స్వీయప్రకటిత గోరక్షకులు దారుణానికి ఒడిగట్టారు. పశువులను తరలిస్తున్న వర్తకుడు ఇద్రీస్ పాషాను అడ్డుకొని రూ. 2లక్షలు డిమాండ్ చేశారు. పశువుల తరలింపుకు సంబంధించిన మార్కెట్ పత్రాలు తన వద్ద ఉన్నాయని, డబ్బులు ఇవ్వనని ఇద్రీస్ వారితో చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు పునీత్ కెరేహళ్లి, అతని సహచరులు ఇద్రీస్ పాషాను కొట్టి చంపారు. ఆపై పరారయ్యారు. ఇద్రీస్ మృతదేహం రామానగర జిల్లా, సత్నూరు గ్రామం వెంబడి రోడ్డు వద్ద లభించింది. ఈ ఘటన శనివారం జరిగింది. పోలీసులు హత్య, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి శాంతికి విఘాతం కలిగించడం నేరాల కింద కేసు నమోదు చేశారు.

ఐఐటీ పీహెచ్‌డీ విద్యార్థి ఆత్మహత్య

చెన్నై: తమిళనాడులోని వేలాచేరిలో మరోసారి విషాద ఘటన చోటుచేసుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)-మద్రాసులో చదువుతున్న పీహెచ్‌డీ విద్యార్థి సచిన్ తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పశ్చిమబెంగాల్ వాసి అని పోలీసులు తెలిపారు. ఈ ఏడాది ఐఐటీ-మద్రాసులో ఆత్మహత్యా ఘటనలు చోటుచేసుకోవడం ఇది మూడోసారి. 2018 నుంచి 11 ఘటనలు జరిగాయి. తాజా ఘటనపై పోలీసుల సమాచారం ప్రకారం ఆత్మహత్యకు పాల్పడిన సచిన్ మార్చి 31న 'ఐయామ్ సారీ...అంత మంచిగా ఏమీ లేదు' అని వాట్సాప్ స్టాటస్ పోస్ట్ చేశాడు. దీంతో మిత్రులు అతని ఇంటికి చేరుకునే సరికి గదిలో ఉరివేసుకుని కనిపించాడు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం రాయపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

సుపారీ ఇచ్చినవారి పేర్లు చెప్పండి

మోదీకి కపిల్ సిబల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇందుకోసం సుపారీ కూడా ఇచ్చారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చూసిన వ్యాఖ్యలపై తాజాగా రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ స్పందించారు. సుపారీ ఇచ్చిన వారి పేర్లు చెప్పాలని, తద్వారా వారిని విచారించేందుకు వీలుంటుందని ప్రధాని మోదీకి ఆయన విజ్ఞప్తి చేశారు. భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని లండన్‌లో రాహుల్ గాంధీ ఇటీవల వ్యాఖ్యానించడం, అనంతరం ఓ క్రిమినల్ పరువు నష్టం కేసులో రాహుల్ దోషిగా తేలడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వంపై వేటు పడటం, ఈ అంశాన్ని తాము నిశితంగా పరిశీలిస్తున్నామని బ్రిటన్, జర్మనీ ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. 'తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, తన సమాధి కట్టేందుకు కొందరు సుపారీ ఇచ్చారని మోదీజీ ఆరోపించారు. వ్యక్తులు, సంస్థలు, దేశాలు...వీరిలో ఎవరున్నా.. వారి పేర్లు చెప్పండి. ఇది దేశ రహస్యం కాకూడదు. వారిని విచారిద్దాం' అని కపిల్ సిబల్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. భోపాల్‌లో రాణి కమలాపతి స్టేషన్‌లో వందేభారత్ రైలును శనివారం ప్రారంభించిన అనంతరం మాట్లాడిన మోదీ... సుపారీ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి వారికి మద్దతుగా కొందరు దేశం లోపల, మరికొందరు దేశం బయట ఉండి పనిచేస్తున్నారని మోదీ ఆరోపించారు.

ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం

పంజాబ్ బాధిత రైతులకు న్యాయం : కేఎంఎస్‌సీ డిమాండ్ - బటాలా రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో

చండీగఢ్: పంజాబ్‌కు చెందిన రైతు సంఘం కిసాన్ మజ్దూర్ సంఘర్షన్ కమిటీ (కేఎంఎస్‌సీ) ఆదివారం ఆందోళన బాట పట్టింది. ప్రతికూల వాతావరణం వల్ల పంట నష్టపోయిన రైతులకు, రోడ్డు ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయమైన పరిహారం తదితర డిమాండ్ల పరిష్కారం కోసం గురుదాస్‌పూర్‌లోని బటాలా రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో నిర్వహించింది. రైల్వే స్టేషన్‌లో టెంట్లు వేసుకొని ట్రాకుపైనే రైతులు బైఠాయించి తమ డిమాండ్ల సత్వర పరిష్కారానికి డిమాండ్ చేశారు. కేఎంఎస్‌సీ ప్రధాన కార్యదర్శి సర్వన్ సింగ్ పంధేర్ విలేకరులతో మాట్లాడుతూ 100 శాతం పంట నష్టం జరిగితే ఎకరాకు కనీసం రూ.50వేలు చొప్పున రైతులకు పరిహారం ఇవ్వాలని, రోడ్డు ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన వారికీ న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానలతో జరిగిన నష్టానికి సముచిత పరిహారం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని అన్నారు. పంట రుణాలు మాఫీ చేయాలని, సంక్షోభ సమయంలో రైతులకు ఊరట కల్పించేలా రుణ చెల్లింపుల విడతలను ఆరు నెలలకు వాయిదా వేయాలని కోరారు. ప్రత్యేక 'గిర్దావారీ' (రెవెన్యూ సర్వే) ప్రక్రియను వేగవంతం చేయాలని, నష్టాన్ని అంచనా వేసి సత్వరగా బాధిత రైతులకు పరిహారమివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా పంజాబ్‌లో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్లు, తీవ్రగాలుల కారణంగా గోధుమ, ఇతర పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల జరిగిన పంట నష్టానికి ఇచ్చే పరిహారాన్ని 25శాతం పెంచుతూ పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది.

పతంజలి ఉత్పత్తులు...53 తప్పుడు ప్రకటనల గుర్తింపు

న్యూఢిల్లీ: యోగా గురువు రామ్‌దేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ... రక్తపోటు, మధుమేహం, కణితులు, దృష్టిలోపం, అధిక కొలెస్ట్రాల్ తదితర వ్యాధులకు వినియోగించే సంబంధించిన ఉత్పత్తుల ద్వారా తప్పుదోవ పట్టించే 53 ప్రకటనలను ప్రభుత్వ అధికారులు గుర్తించారు. కేరళకు చెందిన వైద్యుడి ఆరోపణలను పరిగిణలోకి తీసుకున్న కేంద్రం ఈ మేరకు నిర్ణయించింది. అభ్యంతరకర ప్రకటనలకు సంబంధించి డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్ 1954 కింద తగిన చర్య తీసుకోవలసిందిగా ఉత్తరాఖండ్‌లోని ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, హెూమియోపతి) విభాగాన్ని ఫిబ్రవరి 10న ఆదేశించినట్లు కూడా ఆయుష్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. గత ఎనిమిది నెలలుగా రక్తపోటు, మధుమేహం, దృష్టిలోపం, థైరాయిడ్ సమస్యలకు సంబంధించి 18 తప్పుదోవ పట్టించే ప్రకటనలు ప్రసారమైనట్లు ఫార్మా విజిలెన్స్ కేంద్రాలు వెల్లడించినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. మార్చి 28న రాజ్యసభలో సభ్యుడు వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు మంత్రిత్వ శాఖ ఈ మేరకు సమాధానమిచ్చింది. కేరళకు చెందిన నిర్దిష్ట ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రకటనలను నియంత్రించే డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్ 1954 నిబంధనలను ఈ ఉత్పత్తుల ప్రకటనలు ఉల్లంఘిస్తున్నాయని నేత్ర వైద్యుడు కె.వి. బాబు ఫిబ్రవరిలో కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థలకు ఫిర్యాదు చేశారు. ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ విభాగం గత ఏడాది నవంబర్ 9న ఐదు ఔషధాల ఉత్పత్తిని నిలిపివేయాలని పతంజలి మందుల తయారీ యూనిట్ దివ్య ఫార్మసీని ఆదేశించింది. అయితే మూడు రోజుల తర్వాత ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది. కొన్ని ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించే నిబంధనలు ఆయుర్వేద మందులకు వర్తించవని దివ్య ఫార్మసీ వాదించింది. సాంప్రదాయ ఔషధాల తప్పుదోవ పట్టించే ప్రకటనలను అరికట్టేందుకు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1945కి కేంద్రం 2018లో ప్రవేశపెట్టిన 170వ నిబంధనపై స్టే విధించిన బాంబే హైకోర్టు ఉత్తర్వులను కంపెనీ ఉదహరించింది.

యువతకు ఉద్యోగాలు... ఉచిత విద్యుత్

అసోం ప్రజలకు కేజ్రీవాల్ హామీ

గువహటి: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అసోంలో అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఉచిత విద్యుత్ అందిస్తామని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం హామీ ఇచ్చారు. ఏడేళ్లలో ఆప్ ప్రభుత్వం ఢిల్లీ రూపురేఖలు మార్చేసిందని, అసోంలో బీజేపీ అదే వ్యవధిలో అధికారంలో ఉన్నప్పటికీ 'చెత్త రాజకీయాలు తప్ప మరేమీ లేదని' ఆయన అన్నారు. ఢిల్లీ, పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాయని, పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే అసోంలో కూడా అదే విధంగా ఉంటుందని కేజ్రీవాల్ ఇక్కడ జరిగిన ర్యాలీలో అన్నారు. ఆప్ అధికారంలోకి వస్తే అసోంలోని నిరుద్యోగ యువకులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏడేళ్లలో ఢిల్లీలో 12 లక్షల మందికి, పంజాబ్‌లో ఏడాదిలో 28 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. రాష్ట్రంలో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా గువహటిలోని అన్ని గృహాలకు పైపుల ద్వారా నీటిని అందజేస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. '2015లో ఢిల్లీలో ఆప్, 2016లో అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాయి. ఈరోజు ఢిల్లీ రూపురేఖలను మార్చాం. హిమంత బాబు (అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ) ఏడేళ్లలో రాష్ట్రానికి ఏం చేశారు? ఏమీ లేదు. నీచ రాజకీయాలు మాత్రమే' అని కేజ్రీవాల్ ఆరోపించారు.

డీఎంవీఎస్ విద్యార్థులకు జేఈఈ, నీట్ శిక్షణ

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు: మంత్రి అతిషి

న్యూఢిల్లీ: ఢిల్లీ మోడల్ వర్చువల్ స్కూల్ (డీఎంవీఎస్) విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ), నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కు ఉచిత శిక్షణ పొందుతారని ఢిల్లీ విద్యా మంత్రి అతిషి ఆదివారం తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు చెందిన అధికారులతో ఆమె ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అనేక సూచనలు చేస్తూ, వర్చువల్ స్కూల్ కోసం ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 'ఢిల్లీ విద్యా విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. దేశవ్యాప్తంగా పిల్లలు ఇందులో భాగం కావడానికి ఇదే కారణం. మా ప్రభుత్వానికి చెందిన డీఎంవీఎస్ వాటిని మాకు అనుసంధానం చేయడానికి పని చేస్తోంది' అని అతిషి చెప్పారు. నాణ్యమైన విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని, తద్వారా అన్ని రాష్ట్రాల విద్యార్థులు ఇందులో భాగమవుతారని ఆమె అన్నారు. డీవీఎంఎస్ భౌతిక సంస్థకు చెందిన అన్ని ప్రయోజనాలను కలిగి ఉంది. డీబీఎస్ఈతో అనుబంధం కలిగి ఉంది. నేడు ఢిల్లీతో సహా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఈ సంవత్సరం దాని పరిధిని విస్తరించడంపై మా దృష్టి ఉంది. వారి స్థానంతో సంబంధం లేకుండా నాణ్యమైన విద్య అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చూడడమే మా లక్ష్యం' అని తెలిపారు.

డీఎంవీఎస్‌కు చెందిన వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు వర్చువల్‌గా ఐఐటీ-జేఈఈ, నీట్ శిక్షణ పొందుతారని అన్నారు. వర్చువల్ స్కూల్ విద్యార్థులకు కోడింగ్, డిజిటల్ మీడియా, డిజైన్, ఫైనాన్స్, అకౌంటింగ్ వంటి ఉద్యోగ-ఆధారిత కోర్సులతో పాటు పరిశ్రమ నిపుణులు రూపొందించిన స్వల్పకాలిక, అధునాతన కోర్సులను కూడా అందిస్తుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆగస్టు 31, 2022న 'దేశంలో మొట్టమొదటి వర్చువల్ స్కూల్' ను ప్రారంభించారు. దీనిలో భారతదేశం అంతటా ఉన్న విద్యార్థులు 9 నుంచి 12 తరగతులలో ప్రవేశానికి అర్హులు. అయితే, ముఖ్యమంత్రి వాదనను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) తోసిపుచ్చింది. దేశంలో మొదటి వర్చువల్ స్కూల్‌ను 2021లో కేంద్రం ఇప్పటికే ప్రారంభించిందని పేర్కొంది.

5 వరకు వర్షాలు: ఐఎండీ

న్యూఢిల్లీ: ఈశాన్య భారతంలో ఏప్రిల్ 5 వరకు తేలికపాటు, మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడుతుందని స్పష్టం చేసింది. ఐఎండీ సమాచారం మేరకు బుధవారం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి, మోస్తరు వర్షాలు ఈశాన్య భారతంలో పడతాయి. వీటితో పాటు ఢిల్లీ, పంజాబ్, చండీగఢ్, హరియాణా, ఉత్తరప్రదేశ్?, రాజస్థాన్‌లలో ఏప్రిల్ 5 వరకు ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం తేలికపాటి వర్షం పడింది. ఫలితంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గాయి. సగటు ఉష్ణోగ్రతలు సైతం 28.4కు దిగొచ్చాయి. దేశ రాజధానిలో ఆదివారం ఆకాశం మేఘావృత్తమై ఉంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్‌గాను, కనిష్ఠ ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గాను నమోదైంది. జమ్ముకశ్మీర్‌లో శనివారం భారీ వర్షాలు కురిశాయి.

ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదం

ఇద్దరి మృతి, 20మందికి గాయాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముస్సోరీ నుంచి డెహ్రాడూన్‌కు వెళుతున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు అమ్మాయిలు ప్రాణాలు కోల్పోగా డ్రైవర్‌తో సహా మరో 20 మందికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకొన్నాయి. ఇండో-టిబెటన్ బార్డర్ పోలీసుల సహాయంతో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించినట్లు మసూరీ పోలీసులు వెల్లడించారు. ఉత్తరాఖండ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు చెందిన బస్సు ముస్సోరీ నుంచి డెహ్రాడూన్‌కు వెళుతుండగా ప్రమాదం జరిగిందని, ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. శేర్‌ఘాటీ సమీపంలో బస్సు అదుపుతప్పి 70 అడుగుల లోతైన లోయలో పడిపోయిందన్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు చెప్పారు.

పెరుగుతున్న కరోనా కేసులు

నూదిల్లీ: భారత్‌లో కరోనా కేసులు ఆదివారం గణనీయంగా పెరిగాయి. ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 3,824 కేసులు నమోదయ్యాయి. ఒక్కరోజు వ్యవధిలో ఈ స్థాయిలో కేసులు పెరగడం గత ఆరు నెలల్లో ఇదే తొలిసారి. తాజా కేసులతో దేశవ్యాప్తంగా క్రియాశీల కోవిడ్ కేసుల సంఖ్య 18,389కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశంలో 4,47,22,605 కేసులు నిర్ధారణ అయ్యాయి. మృతుల సంఖ్య 5,30,881కి చేరింది. గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా ఐదుగురు కరోనాతో చనిపోయారు. ఢిల్లీ, హరియాణా, కేరళ, రాజస్థాన్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు.

గతంలో చనిపోయిన ఒక వ్యక్తి మరణాన్ని కేరళ ప్రభుత్వం నిన్నటి లెక్కల్లో నివేదించింది. రోజువారీ పాజిటివిటీ రేటు 2.87 శాతంగా, వారం రోజుల పాజిటివిటీ రేటు 2.24 శాతంగా నమోదైంది. మరోవైపు రికవరీ రేటు 98.77 శాతంగా ఉంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 220.66 కోట్ల కోవిడ్ టీకాలు పంపిణీ చేశారు.

రాహుల్ పది జన్మలెత్తినా...

కేంద్రమంత్రి ఠాకూర్ ఎదురుదాడి

న్యూఢిల్లీ: 'నా పేరు సావర్కర్ కాదు. క్షమాపణలు చెప్పను' అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. రాహుల్ పది జన్మలెత్తినా సావర్కర్‌లా మారలేరని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా ఠాకూర్ మీడియాతో మాట్లాడారు. 'సావర్కర్‌ను అవమానించినందుకు రాహుల్‌గాంధీని దేశం ఎప్పటికీ క్షమించదు. ఆయన పది జన్మలెత్తినా.. సావర్కర్ కాలేరు. సావర్కర్ తన జీవితమంతా స్వాతంత్ర్యం కోసం పోరాడారు. రాహుల్ మాత్రం తన సమయాన్ని బ్రిటిషర్ల సాయంతో భారత ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకే కేటాయించారు' అని ఠాకూర్ విమర్శించారు. మరోవైపు బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటీవల చెలరేగిన హింసాత్మక ఘటనలు దురదృష్టకరమని పేర్కొన్నారు. బీహార్‌లో జంగిల్ రాజ్(ఆటవిక పాలన) తిరిగి వచ్చిందని ఆరోపించారు. బీహార్‌లో శాంతిభద్రతలు దిగజారాయి. లాలూ హయాంలో ఉన్న జంగిల్ రాజ్.. మళ్లీ నితీశ్ కుమార్, తేజస్వీ యాదవ్ హయాంలో తిరిగి రావడం దురదృష్టకరమని ఠాకూర్ అన్నారు.

మమతా బెనర్జీ హిందూ వ్యతిరేకి

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విరుచుకుపడ్డారు. ఆ రాష్ట్రంలో రామభక్తులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలను ఆమె ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో శ్రీరామనవమి సందర్భంగా జరిగిన శోభాయాత్రపై దాడులు జరిగాయి. పెద్దఎత్తున హింసాకాండ జరిగింది. రాజు ఝా అనే బీజేపీ కార్యకర్త శనివారం హత్యకు గురయ్యారు. మమత బెనర్జీ ఓ వర్గానికి కొమ్ముకాస్తున్నారని, ఆమె హిందూ వ్యతిరేకి అని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో రామభక్తులపై దాడులు జరుగుతున్నాయన్నారు. రామభక్తులపై రాళ్లు, బాంబులు విసురుతున్నారన్నారు. వారిని లాఠీలతో కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరామ నవమి శోభాయాత్రను బలవంతంగా నిలిపివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఏ స్థాయిలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారో స్పష్టంగా చూడవచ్చునన్నారు. ఆమె హిందూ వ్యతిరేకి అని స్పష్టమవుతోందన్నారు. హిందువులపై దాడులు జరుగుతూ ఉంటే మమత మౌన ప్రేక్షకురాలిగా మిగిలిపోయారన్నారు. ఆమె నిద్రపోతున్నారని దుయ్యబట్టారు. ఓ వర్గానికి ఆమె భద్రత కల్పిస్తున్నారన్నారు. ఆమె హిందువులపై హింసను రెచ్చగొడుతున్నారన్నారు.

బాపట్లలో విశాలాంధ్ర జిల్లా కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ఉద్యమాల స్థావరం విశాలాంధ్ర కార్యాలయమని విశాలాంధ్ర జాతీయ దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలోని శృంగారపురంలో ఆదివారం విశాలాంధ్ర జిల్లా కార్యాలయాన్ని కూన అజయ్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రికకు 70 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో దినపత్రికలు ఉన్నప్పటికీ విశాలాంధ్రకు మరేదీ సాటిరాదన్నారు. కార్పొరేట్ పత్రికలుగా దీటుగా సీపీఐ అధ్వర్యంలో విశాలాంధ్ర విజ్ఞానసమితి సొసైటీతో విశాలాంధ్ర దినపత్రిక, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర బుక్ హౌస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సందేశం పంపారు. న్యూస్ ఎడిటర్ ఎం.మురళీకృష్ణ, బ్యూరో చీఫ్ చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, కర్లపాలెం ఎంపీపీ వనజ, జనసేన నేత వామన వెంకట శివన్నారాయణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, డా॥ జి.చార్వాక, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

మనువాదాన్ని తిప్పికొట్టాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- మహిళా సమాఖ్య శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: మహిళలకు సంబంధించి పాలకుల విధానంలో మార్పు రావాలని, మనువాద భావజాలాన్ని తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నొక్కిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సమితి అధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక కార్యశాల ఆదివారం విజయవాడలోని దాసరి భవనంలో ప్రారంభమైంది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రామకృష్ణతో పాటు పార్టీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం రామకృష్ణ, ముప్పాళ్ల మాట్లాడుతూ పెరుగుతున్న ధరలపై ప్రజలు, విపక్షాల ఆందోళన్ని బేఖాతరు చేస్తున్న మోదీ ప్రభుత్వంపై సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో స్త్రీలు అసమానతలకు గురవుతున్నారని, పాలకులు లౌకిక రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సమాఖ్య పోరాడి హక్కులు సాధించిందన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ల కోసం 26ఏళ్లుగా పోరాటం సాగిస్తున్నారని గుర్తుచేశారు. సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ ఈ కార్యశాలలో భౌతికవాదం, మార్క్సిజం, మనువాదం- మూఢాచారాలు, మహిళా సంక్షేమం, సాధికారత, భారతీయ సంస్కృతి, రాజ్యాంగం మహిళలు చట్టాలు, అశ్లీల సాహిత్యం, విష సంస్కృతి, మహిళా ఉద్యమాల ఆవశ్యకత తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని అన్నారు. మహిళల ఆరోగ్యంపై డాక్టర్ రజనీ, మార్క్సిజంపై ప్రొఫెసర్ అంజయ్య బోధిస్తారని చెప్పారు. మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి అధ్యక్షత వహించగా క కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మావతి, కోశాధికారి పంచదార్ల దుర్గాంబ, పి.రాణి, ఆర్.లక్ష్మిదేవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రభాకర్ మృతి

- నేడు తిరుపతిలో అంత్యక్రియలు
- ఆయన మృతి పార్టీకి తీరని లోటు: నారాయణ, హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: సీపీఐ సీనియర్ నాయకులు ప్రభాకర్ అలియాస్ ఆర్టీసీ ప్రభాకర్ ఆదివారం గుండె పోటుకు గురై మృతిచెందారు. బెంగళూరులోని వారి బంధువుల ఇంట్లో ఆయన తుదిశ్వాస విడిచారు. సోమవారం తిరుపతిలో దహన సంస్కారాలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభాకర్ మృతికి సీపీఐ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ప్రభాకర్ మరణం అత్యంత బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సంతాపాన్ని ప్రకటించారు. 40 ఏళ్లపాటు ప్రభాకర్‌తో తనకున్న బంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'నేను సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శిగా, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రాంతీయ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ప్రభాకర్ ఆర్టీసీలో చురుకుగా ఉండేవారు. దాంతో ప్రభాకర్ ఆర్టీసీ సంఘంలోకి వచ్చారు. అప్పటి నుంచి సంఘ నిర్మాణ బాధ్యతలను చేపట్టారు. నిబద్ధతగల కార్మిక నాయకుడు ప్రభాకర్ అని కొనియాడారు. ప్రభాకర్ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, ఏఐటీయూసీ జిల్లా బాధ్యులుగా వ్యవహరించినట్లు నారాయణ తెలిపారు. ప్రభాకర్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని, ఈమధ్యనే ఆయన భార్య కూడా చనిపోయారని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి సంతాపాన్ని ప్రకటిస్తూ ప్రభాకర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతానికి కృషి చేశారని, ఏఐటీయూసీ కార్యదర్శిగా కార్మికులకు అండగా నిలిచారని, పార్టీకి నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఆయన కార్యకర్తలకు ఆదర్శమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.రామా నాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కుమార్ రెడ్డి, కె.రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

మామిడి రైతును ఆదుకోండి

రైతుసంఘం ప్రతినిధి బృందం డిమాండ్

విశాలాంధ్ర-నూజివీడు: ఈదురుగాలులకు తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతుకు తీవ్ర నష్టం కల్గించిన మామిడి తోటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర బృందం ఆదివారం నూజివీడు ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శి జమలయ్య, సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, ఏలూరు జిల్లా రైతు సంఘం కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావులతో కూడిన బృందం నూజివీడు, అన్నవరం, హనుమంతులగూడెం, వెంకటాయపాలెం గ్రామాల్లో తోటలను పరిశీలించడంతో పాటు మామిడికి సంభవించిన నష్టాన్ని గురించి రైతులను అడిగి తెలుసుకున్నది. రైతులు తమ వేదనను నాయకులతో పంచుకున్నారు. ఈ ఏడాది మామిడికి విపరీతంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేశామని, అయినా కాయ నాణ్యతను వాతావరణ పరిస్థితులు దెబ్బతీశాయన్నారు. మామిడి మంగు తెగులు బారిన పడిందని వాపోయారు. ఓ పక్క నాణ్యత కోల్పోయి ఇబ్బందులలో ఉన్న మామిడిని శుక్రవారం వచ్చిన ఈదురు గాలులు మరింత ఇబ్బందులలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఏప్రిల్ ప్రారంభంలోనే ధరలు తగ్గిపోయాయని, నాణ్యత కోల్పోయిన మామిడిని కొనే నాధుడు లేడని ఆవేదన చెందారు. అనంతరం కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఇబ్బందులలో ఉంటే స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మామిడి రైతులను సమీకరించి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. జమలయ్య మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండు చేశారు. సీపీఐ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, రైతు సంఘం నాయకులు చలసాని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ వాసులకు హెల్త్‌కార్డులు ఇవ్వండి

కేసీఆర్‌కు నారాయణ లేఖ



హైదరాబాద్: తెలంగాణలోని అన్ని వృద్ధాశ్రమాల్లో ఉండే వారికి ఆరోగ్య కార్డులు కోరుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆదివారం ఓ లేఖ రాశారు. 'వృద్ధాప్యం అన్నది మానవ జీవితంలో సహజం. వయస్సు మీదపడే క్రమంలో మనిషి అనేక శారీరక సమస్యలతో బాధపడటం అనివార్యం. అనేక వృద్ధాశ్రమాల్లో ఉండే వృద్ధులకు ఆరోగ్య సంరక్షణ సమస్యగా ఉంది. భౌతిక, మానసిక కార్యకలాపాలు, వినోదం వంటివి నిర్వాహకులు కల్పించినప్పటికీ సముచిత వైద్య సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. అనేక వృద్ధాశ్రమాలు, సంక్షేమ సంస్థలు ఈ సమస్యను నా దృష్టికి తేవడంతో మీకు తెలియజేసే ఉద్దేశంతో లేఖ రాస్తున్నా.

మా ఈ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని వృద్ధాశ్రమ వాసులకు ఆరోగ్య కార్డు కల్పించేందుకు తగు చర్యలు చేపడతారని ఆశిస్తున్నా' అని లేఖలో నారాయణ పేర్కొన్నారు.

అదానీతో బంధం ఏమిటో చెప్పండి: రాహుల్

న్యూఢిల్లీ: వ్యాపారవేత్త గౌతం అదానీతో తనకున్న సంబంధం ఏమిటో ప్రధాని మోదీ ఇప్పటికైనా చెప్పాలని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కోరారు. తాను చాలా కాలంగా ఒకటే ప్రశ్న అడుగుతున్నా మోదీ నుంచి సమాధానమవే కరువైందని వ్యాఖ్యానించారు. రాహుల్ ఆదివారం సామాజిక మాధ్యమం ద్వారా మరోమారు మోదీకి ప్రశ్నలు సంధించారు. 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, నేను చాలా కాలంగా ఒకటే ప్రశ్న అడుగుతున్నా. మీరు ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు. కాబట్టి మళ్లీ అడుడుతున్నా. ఆ రూ.20వేల కోట్లు ఎవరివి? ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఈపీఎఫ్‌ఓలో జమ చేసే మొత్తాన్ని అదానీకి ఎందుకు ఇస్తున్నారు? మీకు అదానీకి మధ్య సంబంధం ఏమిటో దేశానికి చెప్పండి. నిజాలు మాట్లాడండి' అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఏపీలో సింథటిక్ ట్రాక్‌ల ఏర్పాటుకు కృషి

- ఏపీఓఏలో గ్రూపుల వివాదాన్ని పరిష్కరిస్తా
- క్రీడా మౌలిక వసతులపై ప్రజాప్రతినిధుల చొరవ అవసరం
- ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఏపీకి సింథటిక్ ట్రాక్‌లు అందజేయడానికి కృషి చేస్తానని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) చైర్‌పర్సన్,, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష హామీ ఇచ్చారు. ఆదివారం ఇక్కడి ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియంలో జీటో అధ్వర్యంలో నిర్వహించిన 'అహింసా రన్ ఫర్ పీస్' ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విశాలాంధ్ర'తో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని ఏ నగరానికి సింథటిక్ ట్రాక్ లేదని తెలిసి ఆశ్చర్య పోయారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఒక్క సింథటిక్ ట్రాక్ లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా ఖేలో ఇండియా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. అలాగే, అన్ని రాష్ట్రాలకు క్రీడా మౌలిక అందించడానికి అనేక పథకాలు అమలులో ఉన్నాయని ఆమె చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహాయం చేసినప్పటికీ దురదృష్టవశాత్తు ఏపీలో ఒక్క సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ కూడా లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేందుకు సింథటిక్ ట్రాక్ ఆవశ్యకతను ఒలింపియన్ పీటీ ఉష నొక్కి చెప్పారు. అలాగే విజయవాడలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె అన్నారు. 'విజయవాడ ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసింది. నగరం గ్రామాలకు చాలా సమీపంలో ఉంది, ఇక్కడ మంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారు. కోచింగ్ సౌకర్యాలను ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను అందించగలిగితే, ఖచ్చితంగా ఎక్కువ మంది అంతర్జాతీయ పతక విజేతలు తయారవుతారు' అని ఆమె అన్నారు. సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, క్రీడా సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ఎంపీలు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు. సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు. 'ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుపై అధికార వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ప్రతిపక్ష టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రబాబు, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని)తో మాట్లాడతాను... ఆ తర్వాత సింథటిక్ ట్రాక్ మంజూరు చేసేందుకు నా వంతు కృషి చేస్తాను' అని పీటీ ఉష హామీ ఇచ్చారు. విజయవాడ, ఇతర నగరాల్లో సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేసేందుకు సాప్, ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆమె కోరారు. కాగా రాష్ట్రాల ఒలింపిక్ అసోసియేషన్లలో అనేక గ్రూపుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పీటీ ఉష తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ)లో గ్రూపుల వివాదాన్ని కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తామన్నారు. తాను ఐఓఏ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టకముందు క్రీడా సంస్థల మధ్య 280కి పైగా వివాదాలు ఉన్నాయని, ప్రత్యేక కమిటీ కృషితో అవి 30కి తగ్గాయని ఆమె చెప్పారు. ఒలింపిక్ అసోసియేషన్లు, క్రీడా సంఘాల వివాదాలు స్వల్ప వ్యవధిలో పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

కాస్ట్యూమ్ కృష్ణ మృతి

హైదరాబాద్: సీనియర్ నటుడు, నిర్మాత కాస్ట్యూమ్ కృష్ణ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణ ఆదివారం ఉదయం చెన్నైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కాస్ట్యూమ్ కృష్ణ స్వస్థలం విజయనగరం జిల్లాలోని లక్కవరపుకోట. కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన భారత్ బంద్ సినిమాతో ఆయన నటుడిగా పరిచయం అయ్యారు. పెళ్లి పందిరి సినిమాను నిర్మించడంతో పాటు అందులో నటించారు.

విశాలాంధ్ర రీల్

కాస్ట్యూమ్ కృష్ణ మృతికి టాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాస్ట్యూమ్ కృష్ణ కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ నిర్మాత దిల్ రాజు ట్వీట్ చేశారు. సినీ రంగంలో అసిస్టెంట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా తన కెరీర్‌ను మొదలుపెట్టిన కృష్ణ.. ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి లాంటి స్టార్ హీరోలకు, వాణిశ్రీ, జయసుధ, జయప్రద, శ్రీదేవి లాంటి హీరోయిన్లకు ఆయన కాస్ట్యూమ్స్ అందించారు. ఆ తర్వాత అనేక విజయవంతమైన సినిమాలను నిర్మించడంతో పాటు విలన్‌గా, సహాయక నటుడిగా పాత్రలు పోషించారు. పెళ్లాం చెబితే వినాలి, అల్లరి మొగుడు, దేవుళ్లు, మా ఆయన బంగారం, విలన్, పుట్టింటికి రా చెల్లి తదితర సినిమాలలో నటించి, ప్రేక్షకులను మెప్పించారు.

ఆకట్టుకుంటున్న 'బలగం'

హైదరాబాద్: జబర్దస్త్ కమెడియన్‌గా అందరికీ తెలిసిన వేణు దర్శకత్వం వహించిన 'బలగం' ప్రేక్షకుల ఆదరణ చూరగొంటోంది. పెద్ద హీరో లేడు.. ఫైట్లు లేవు.. గ్రాఫిక్స్ లేవు... వందల కోట్ల బడ్జెట్ అంతకన్నా కాదు...బంధువుల మధ్య అనుబంధాన్ని, పల్లెను, మట్టి మనుషులను చూపించాడు వేణు. ఎప్పుడు మొదలుపెట్టాడో...ఎప్పుడు పూర్తి చేశాడో...ఎవ్వరికీ అంచనాలు లేవు. నిశ్శబ్దంగా థియేటర్లలోకి వచ్చి సంచలనం సృష్టించింది...సృష్టిస్తూనే ఉంది. ఇటు కామెడీ.. అటు భావోద్వేగాలను సమంగా నడిపిస్తూ వేణు తీసిన సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తోంది. క్లైమాక్స్ పాట ప్రతి మనసునూ కదిలిస్తోంది. ప్రతి కంటినీ తడిపేస్తోంది. థియేటర్లలో ఇంకా ఆడుతున్న ఈ సినిమా... అటు ఓటీటీలోనూ సందడి చేస్తోంది. అంతేకాకుండా అనేక గ్రామాల్లో బలగం సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. సినిమాను చూస్తూ ఎంతో మంది భావోద్వేగానికి లోనవుతున్నారు. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 'జనాల్లోకి బాహుబలి కన్నా ఎక్కువ చొచ్చుకుపోయింది బలగం. ఇప్పట్లో ఆగేలా లేదు' అంటూ నాని రెడ్డి అనే వ్యక్తి ఓ వీడియోను ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన 'బలగం' హీరో ప్రియదర్శి... 'ఇది నా సినిమా నా' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డైరెక్టర్ వేణు కూడా ఈ వీడియోపై స్పందించారు. 'నా బలగం ప్రేక్షకులని ఇలా కదిలిస్తోందని వీడియోస్ నాకు పంపిస్తుంటే అదృష్టంగా భావిస్తున్నా. ఇలా చూసి 'మళ్లీ థియేటర్స్ కి ఫ్యామిలీతో వెళ్లి చూస్తున్నాం'' అని పిక్స్ పంపుతున్నారు. ఆనందభాష్పలతో మీ వేణు' అని ట్వీట్ చేశారు.

రాజకీయాల్లోకి రాను: రిషబ్‌శెట్టి

బెంగళూరు: కాంతారా చిత్రంతో దేశవిదేశాల్లో ప్రేక్షకాదరణ సంపాదించుకున్న హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. తమిళనాడుకు చెందిన ఓ జర్నలిస్ట్ ట్వీట్ చేయడంతో ఈ ప్రచారం మొదలైంది. రాజకీయాల్లోకి వస్తే అండగా ఉంటామంటూ ఆయన అభిమానులు ట్వీట్లు చేస్తున్నారు. కన్నడ ఇండస్ట్రీలో జరుగుతున్న ప్రచారంపై తాజాగా రిషబ్ శెట్టి స్పందించారు. తనకు రాజకీయాల్లోకి రావాలని లేదని తేల్చిచెప్పారు. తన సినిమాలకు మాత్రం మద్దతివ్వాలంటూ అభిమానులు, ప్రేక్షకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే తన రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ప్రచారం కల్పితమేనని రిషబ్ స్పష్టం చేశారు. గతంలోనూ ఇలాగే ప్రచారం జరిగిందని గుర్తుచేశారు. తమ పార్టీకి మద్దతివ్వాలంటూ కొంతమంది రాజకీయ నేతలు అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. అయితే, తన దృష్టి మొత్తం సినిమాలపైనే ఉందని వివరించారు. తన సినిమాలకు అండగా ఉండాలని, థియేటర్లకు వెళ్లి చూడాలని రిషబ్ శెట్టి అభిమానులను కోరారు.

క్రికెట్ దిగ్గజం సలీం దురానీ కన్నుమూత

న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్, స్పిన్ ఆల్‌రౌండర్ సలీమ్ దురానీ కన్నుమూశారు. 88 ఏళ్ల వయసున్న ఆయన చాలా కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం గుజరాత్‌లోని జామ్ నగర్‌లో తుదిశ్వాస విడిచారు. స్పిన్ ఆల్ రౌండర్ అయిన దురానీ... 1971లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో భారత్ చారిత్ర విజయం అందుకోవడంతో ప్రముఖ పాత్ర పోషించారు. భారత్ తరపున ఆయన మొత్తం 29 టెస్టు మ్యాచ్‌లు ఆడారు. ఒక సెంచరీ, 7 అర్ధ సెంచరీలతో 1202 పరుగులు చేశారు. అదేవిధంగా 75 వికెట్లు పడగొట్టారు. గుజరాత్, రాజస్థాన్, సౌరాష్ట్ర తరపున ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 14 సెంచరీలు చేసిన సలీం దురానీ... 3545 పరుగులు చేశారు. 1973లో కాన్పూర్‌లో జరిగిన టెస్టులో సలీం దురానీని తుది జట్టు నుంచి తప్పించింది భారత జట్టు మేనేజ్‌మెంట్. ఈ నిర్ణయాన్ని క్రికెట్ అభిమానులు తట్టుకోలేకపోయారు. 'నో దురానీ, నో టెస్టు' అంటూ ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. దురానీ... 1934, డిసెంబర్ 11న అఫ్గానిస్తాన్‌లోని కాబూల్ లో జన్మించారు. తన 8 నెలల వయస్సులో ఆయన కుటుంబం కరాచీకి వలస వచ్చి స్థిరపడింది. 1947లో భారత్-పాక్ విభజన అనంతరం దురానీ కుటుంబ సభ్యులు భారత్‌కు వచ్చేశారు. 1960లో ముంబై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో భారత్ జట్టు తరపున అరంగేట్రం చేశారు. 1960-70 దశకంలో భారత జట్టులో ఉత్తమ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందారు. బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్ ద్వారా కూడా జట్టు విజయాల్లో ప్రముఖ పాత్రపోషించారు. ఆయన చివరిసారిగా 1973, ఫిబ్రవరిలో ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆడారు. అనంతరం క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన దురానీ... బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. నటుడు ప్రవీణ్ బాబీతో కలిసి 'చరిత్ర' సినిమాలో పనిచేశారు. కాగా, భారత ప్రభుత్వం అందించే అత్యున్నత క్రీడా పురస్కారం అర్జున అవార్డును అందుకున్న మొదటి క్రికెటర్ సలీమ్ దురానీనే కావడం విశేషం. 1960లో ఆయనకు కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డును ప్రదానం చేసింది.

ప్రధాని సంతాపం

సలీం దురానీ మృతికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. 'సలీం దురానీ జీ ఓ క్రికెట్ లెజెండ్... ఆయన ఓ క్రీడా ఇన్‌స్టిట్యూట్ లాంటివారు. భారత క్రికెట్ ఎదుగుదలకు ఆయన ఎంతో చేశారు. సలీం దురానీ మృతి కలిచి వేసింది. ఆయన కుటుంబానికి, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి కలగాలి... గుజరాత్‌తో సలీం దురానీకి విడదీయరాని అనుబంధం ఉంది. క్రికెట్‌లో ఆయన లేని లోటు తీర్చలేనిది' అంటూ ట్వీట్ చేశారు. మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, సునీల్ జోషి, మహ్మద్ అజహరుద్దీన్, మిథాలీ రాజ్, అనిల్ కుంబ్లే, ఆకాశ్ చోప్రా, రవిశాస్త్రి, వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు కూడా సలీం దురానీ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు. ఐపీఎల్ 2023 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ఆరంభానికి ముందు సలీం దురానీ మృతికి సంతాపంగా రెండు జట్ల ఆటగాళ్లు, ప్రేక్షకులు కలిసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

చిత్తుగా ఓడిన సన్‌రైజర్స్

- దంచి కొట్టిన రాజస్థాన్ బ్యాటర్లు
- 72 పరుగులతో ఘన విజయం

ఉప్పల్ (హైదరాబాద్): ఐపీఎల్-16ను సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఓటమితో మొదలుపెట్టింది. ఇక్కడి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ముందు బౌలింగ్‌లో దారుణంగా విఫలమైన ఎస్ఆర్‌హెచ్... తర్వాత భారీ లక్ష్యాన్ని చూసి బ్యాటింగ్ లో కూడా చేతులెత్తేసింది. రాజస్థాన్ బౌలర్ల ధాటికి హైదరాబాద్ బ్యాటర్లు ఏ దశలోనూ క్రీజులో నిలబడలేకపోయారు. ఈ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఎస్ఆర్‌హెచ్... 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 131 పరుగులే చేయగలిగింది. ఫలితంగా రాజస్థాన్ 72 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. ఈ సీజన్‌లో తొలి మూడు మ్యాచ్ లు ఆడిన జట్లు (గుజరాత్, లక్నో, పంజాబ్) తమ సొంత మైదానాల్లో ఆడి విజయాలు సాధిస్తే అందుకు భిన్నంగా హైదరాబాద్... ఉప్పల్‌లో ఆడి ఓటమిని మూటగట్టుకుంది. సన్ రైజర్స్ ఓటమి తథ్యమని తొలి ఓవర్లోనే తేలిపోయింది. ట్రెంట్ బౌల్ట్ వేసిన మొదటి ఓవర్లోనే మూడో బంతికి అభిషేక్ శర్మ (0) క్లీన్ బౌల్డ్ కాగా నాలుగో బంతికి రాహుల్ త్రిపాఠి (0) జేసన్ హోల్డర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో పరుగులేమీ చేయకుండానే 2వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. మరో ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 27, 3 ఫోర్లు) హ్యారీ బ్రూక్ (21 బంతుల్లో 13, 1 ఫోర్)లు కాసేపు క్రీజుల్లో నిలదొక్కుకుని మూడో వికెట్ కు 34 పరుగులు జోడించారు. కానీ టెస్టుల కన్నా మరీ దారుణంగా ఆడారు. ఈ సీజన్‌లో రూ.13.5 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన బ్రూక్... 21 బంతులు ఆడి 13 పరుగులే చేయగలిగాడు. క్రీజులో పడుతూ లేస్తూ ఆడిన బ్రూక్‌ను చాహల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. బ్రూక్ అవుట్ అయ్యాక సన్ రైజర్స్ పతనం మరీ వేగవంతమైంది. జేసన్ హోల్డర్ వేసిన 8వ ఓవర్లో రెండో బంతికి వాషింగ్టన్ సుందర్ (1) భారీ షాట్ ఆడి హెట్మెయర్ కు క్యాచ్ ఇచ్చాడు. అశ్విన్ వేసిన పదో ఓవర్లో మూడో బంతికి గ్లెన్ ఫిలిప్స్ (8) కూడా ఔటయ్యాడు. కాస్తో కూస్తో ఆడిన మయాంక్ అగర్వాల్ ను కూడా చాహల్ బౌల్డ్ చేశాడు. 13 బంతుల్లో ఓ సిక్స్, ఓ ఫోర్‌తో 18 పరుగులు చేసిన అదిల్ రషీద్... చాహల్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. 15 ఓవర్లకు ఎస్ఆర్‌హెచ్... ఏడు వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్న భువనేశ్వర్ (6)ను చాహల్ 18వ ఓవర్లో బౌల్డ్ చేశాడు. ఆఖర్లో ఉమ్రాన్ మాలిక్ (8 బంతుల్లో 19 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి సన్ రైజర్స్ స్కోరును వంద పరుగులు దాటించాడు. చివరి ఓవర్ నవ్‌దీప్ సైనీ వేయగా.. ఆ ఓవర్లో అబ్దుల్ సమద్ (32 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్), ఉమ్రాన్ మెరుపులు మెరిపించి స్కోరు బోర్డును 130 పరుగులు దాటించారు. ఆఖరి ఓవర్లో ఏకంగా 23 పరుగులు రావడం విశేషం. రాజస్థాన్ బౌలర్లలో చాహల్ నాలుగు వికెట్లు తీయగా బౌల్ట్ రెండు వికెట్లు పడగొట్టాడు. హోల్డర్, అశ్విన్‌లు ఒక్కో వికెట్ పడగొట్టారు.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన రాజస్థాన్ రాయల్స్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయింది. ఆ జట్టులో మొదటి ముగ్గురు బ్యాటర్స్ అర్ధ సెంచరీలు చేశారు. జోస్ బట్లర్ (54), యశస్వి జైస్వాల్ (54) తో పాటు కెప్టెన్ సంజూ శాంసన్ (55)లు మెరుపులు మెరిపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.